



# విశ్వంవాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY






SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 సంచిక : 242 తూర్పుగోదావరి జిల్లా ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ ఆదివారం 24 మే 2026 పేజీలు : 12 వెల : 2/-


## ఇల్ నెస్ నుంచి వెల్ నెస్ దిశగా ఏపీ



- ఆగస్టు 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా సంజీవని కార్యక్రమం
- ప్రజారోగ్యానికి సంజీవని ప్రాజెక్టు
- ఆరోగ్యంగా ఉన్న ప్రజలే సమాజానికి నిజమైన సంపద
- గొడ్డలి పార్టీ సమాజానికి హానికరం- నెవర్ అగైన్
- నోరు తెరిస్తే అబద్ధం-మీడియా ముందు మంచోడిగా డ్రామాలు
- పూతలపట్టులో సంజీవని కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు



**పూతలపట్టు, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ప్రపంచ స్థాయి వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానిం చారు. దీనికోసం రాష్ట్రంలో ప్రజారోగ్యాన్ని సంరక్షించేలా సంజీవని కార్యక్రమం అమలు చేయనున్నట్టు వెల్లడించారు. ఈ ఏడాది ఆగస్టు 15 నుంచి సంజీవని ప్రాజెక్టు ఏపీ వ్యాప్తంగా అమలు అవుతుందని ప్రకటించారు. చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గం యాదమరిలో నిర్వహించిన సంజీవని కార్యక్రమానికి ముఖ్యమంత్రి హాజరయ్యారు. సంజీవని కేవలం ఒక సాఫ్ట్‌వేర్ మాత్రమే కాదని, ఇది ఓ సమగ్ర డిజిటల్ పబ్లిక్ హెల్త్ ఆపరేటివ్ సిస్టమ్ అని ముఖ్యమంత్రి అభివర్ణించారు. ఇల్ నెస్ నుంచి వెల్ నెస్ దిశగా ఏపీ అడుగులు వేస్తోందని సీఎం స్పష్టం చేశారు. సంజీవని ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన సిటిజెన్ వెల్ నెస్ మిషన్ అని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. ప్రివెంటివ్, ప్రిడిక్టివ్,

మిగతా .. 2లో..

భారత్‌తో వాణిజ్య బంధం

## మరింత బలోపేతం

### అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో



**విశ్వం వాయిస్ న్యూస్ :** నాలుగు రోజుల పర్యటన నిమిత్తం భారత్‌కు చేరుకున్న అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో ప్రధాని మోదీతో సమావేశమయ్యారు. వైట్ హౌస్‌ను సందర్శించాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తరఫున ఆయన మోదీని ఆహ్వానించారు. సేవా తీర్థ్ (పీఎంవో)లో దాదాపు గంటకు పైగా ప్రధానితో భేటీ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. భద్రత, వాణిజ్యం, సాంకేతిక రంగాలలో అమెరికా-భారత్ సహకారాన్ని మరింతగా పెంపొందించే మార్గాలపై ప్రధాని మోదీతో చర్చించినట్లు మార్కో రూబియో పేర్కొన్నారు. తమ దేశానికి భారత్ ఓ కీలక భాగస్వామి అన్నారు. అమెరికా- భారత్ మధ్య వాణిజ్య సంబంధాలు మరింత బలపడుతున్నాయని.. భారతీయ కంపెనీలు

మిగతా .. 2లో..

శాసనసభ విప్ పదవికి

## ఎమ్మెల్యే అరవ శ్రీధర్ రాజీనామా



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ శాసనసభ విప్ పదవికి రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాలతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. సచివాలయంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను కలిసి ఈమేరకు రాజీనామా పత్రాన్ని అందజేశారు. తనపై వచ్చిన

మిగతా .. 2లో..

## పదేళ్ల బాలిక హత్యోదంతం

స్పందించిన సీఎం విజయ్



**విశ్వం వాయిస్ న్యూస్ :** కోయంబత్తూర్‌లోని దుకాణానికి వెళ్లి అదృశ్యమైన 10 ఏళ్ల బాలిక దారుణ హత్యకు గురైన ఘటన తమిళనాట కలకలం రేపింది. ఈ కేసులో పోలీసులు ఇప్పటికే కార్తీక్, మోహన్ రాజ్ అనే ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. ఈ ఘటనను తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ తీవ్రంగా ఖండించారు. ఇలాంటి అమానవీయ చర్యలను సమాజం ఎన్నటికీ అంగీకరించబోదన్నారు. ఈ కేసులో త్వరిత గతిన దర్యాప్తు పూర్తి చేసి, నిందితులకు

మిగతా .. 2లో..

గోదావరి పుష్కరాల పనులకు

## రూ.వెయ్యి కోట్లు..

### తెలంగాణ క్యాబినెట్ ఆమోదం



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** వచ్చే ఏడాది గోదావరి పుష్కరాల నేపథ్యంలో.. సంబంధిత పనులకు రూ.వెయ్యి కోట్ల కేటాయింపునకు తెలంగాణ మంత్రివర్గం ఆమోదం తెలిపింది. తొలి విడతగా రూ.300 కోట్ల మంజూరుకు పచ్చజెండా ఊపింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ భేటీలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. జూనియర్ కళాశాలల్లోనూ మధ్యాహ్న భోజనం పథకం అమలుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో అల్పాహారం, పాలు అందించాలని నిర్ణయించింది. దాదాపు మూడు గంటలకుపైగా సాగిన మంత్రివర్గ సమావేశ వివరాలను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తదితరులు వెల్లడించారు. జూన్ 1న ఇందిరమ్మ ఇళ్ల రెండో విడత పంపిణీ ప్రారంభం కానుంది. ఒక్కో నియోజకవర్గానికి 2 వేల చొప్పున ఇళ్లు కేటాయించనున్నారు. నియోజకవర్గంలో 1,500 మంది స్థలాలున్న వారికి రూ.5 లక్షల చొప్పున మంజూరు చేయనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 14,800 పూరి గుడిసెలు ఉన్నట్లు గుర్తించామని.. రెండో విడతలో వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు

మిగతా .. 2లో..

తెలుగు రాష్ట్రాల్లో

## గాలివాన బీభత్సం

ముగ్గురి మృతి



**విశ్వం వాయిస్ న్యూస్ :** గత కొన్ని రోజులుగా తెలుగు రాష్ట్రాల్లో ఎండలు మండిపోతున్నాయి. ఉక్కపోతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయితే శనివారం తెలుగు రాష్ట్రాల్లోని కొన్ని ప్రాంతాల్లో భారీ గాలివాన బీభత్సం సృష్టించింది. ఏపీలోని అనకాపల్లి, కాకినాడ, తెలంగాణలోని నాగర్ కర్నూలు జిల్లాల్లో గాలితో కూడిన

మిగతా .. 2లో..

వైఎస్ కుటుంబంతోనే రాష్ట్రంలో

## ఫ్యాక్షన్ రాజకీయం మొదలైంది

### ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్



**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** సమాజంలో జగన్ కుటుంబం.. నిందితులే కానీ, బాధితులు ఎంతమాత్రం కాదని ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ స్పష్టం చేశారు. నేరమయ రాజకీయాలు మొదలు పెట్టింది, కొనసాగిస్తున్నది జగన్ కుటుంబమేనని ఆరోపించారు. వైఎస్ కుటుంబంతోనే రాష్ట్రంలో ఫ్యాక్షన్ రాజకీయం మొదలైందన్నారు. కుటుంబాలు, వర్గాలకు మధ్య పరిమితమైన ఫ్యాక్షన్‌ను రాజకీయాల్లోకి విస్తరించింది జగన్ తాత రాజారెడ్డి అని ఆరోపించారు. రాజకీయాల్లో హింసను కొత్త పుంతలు తొక్కించిన కుటుంబం జగన్‌దని వ్యాఖ్యానించారు. వినే వారుంటే తమది స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబం అని జగన్ చెప్పినా చెబుతారు

మిగతా .. 2లో..

## రాజమండ్రిలో పవన్ టూర్.. ఎల్లుండి పడవ ప్రయాణం!

### రేపు సాయంత్రం రాజమహేంద్రవరం చేరుకోనున్న పవన్ కల్యాణ్ పుష్కర్ ఘాట్ నుంచి కోటిలింగాల ఘాట్ వరకు పడవలో ప్రయాణం



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రాజమహేంద్రవరంలో పర్యటించనున్నారు. గోదావరి పుష్కరాల ఏర్పాట్లను పరిశీలించి, అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు. రేపు సాయంత్రం ఆయన రాజమహేంద్రవరానికి చేరుకుని రాత్రి అక్కడే బస

మిగతా .. 2లో..

## జీపులతో హంగామా కేసులో ఇద్దరికి రిమాండ్

### కేసులో ఏ1గా బొల్లా ఓం, ఏ2గా లింగమనేని రోహిత్ - 14 రోజుల జ్యుడిషియల్ రిమాండ్ విధించిన కోర్టు




**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** విజయవాడలో థార్ జీపులతో సృష్టించిన హంగామా కేసులో ఏ1గా బొల్లా ఓం, ఏ2గా లింగమనేని రోహిత్‌ను పోలీసులు చేర్చారు. ఈ కేసులో ఇద్దరు యువకులకు కోర్టు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. పోలీసులు నిందితులను రిమాండుకు తరలించారు. రెండు రోజుల క్రితం ఈ యువకులు

మిగతా .. 2లో..

ఇరాన్‌పై మరోసారి దాడులకు

## అమెరికా సన్నద్ధం



**విశ్వం వాయిస్ న్యూస్ :** అమెరికా-ఇరాన్ మధ్య శాంతి ఒప్పందానికి సంబంధించి ఏ క్షణంలోనైనా ప్రకటన రావొచ్చని వార్తలు వస్తుండగా.. మరో వైపు ఇరాన్‌పై మరోసారి దాడులకు అమెరికా సన్నద్ధమవుతోందనే నివేదికలు వెలువడుతున్నాయి. చివరి నిమిషంలో దౌత్య ప్రయత్నాలు విఫలమైతే సైనిక చర్యకు దిగే విషయాన్ని అధ్యక్షుడు ట్రంప్ తీవ్రంగా పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్‌తోపాటు

మిగతా .. 2లో..

చంద్రబాబుతోనే

## సీమ అభివృద్ధి

### లోకేష్ గురించి మాట్లాడే అర్హత జగన్‌కు లేదు : మంత్రి సవిత



**పెనుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** రాయలసీమలో రక్తం ఏరులై పారించిన చరిత్ర నీది, నీ తాతది, నీ తండ్రిది.. నీ బాబాయ్ హంతకులు, దళితులను పొట్టన బెట్టుకున్నవారు నీ పార్టీలోనే ఉన్నారు కదా.. మహాత్మా గాంధీ, గౌతమ బుద్ధుడిలా నువ్వు శాంతి వచనాలు పలికితే రాష్ట్రంలో నమ్మేవాళ్లెవరూ లేరు అని జగన్‌పై రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ శాఖ మంత్రి సవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ సైకో పాలనతో అయిదేళ్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పాలయ్యారన్నారు. రాయలసీమలో ఫ్యాక్షనిజాన్ని అంతమొందించి, ఇక్కడి బిడ్డలను ఐటీ, ప్రభుత్వ ఉద్యోగులుగా, వ్యాపారులుగా తీర్చిదిద్దిన

మిగతా .. 2లో..

## అది రాజకీయ పార్టీ కాదు..

### ప్రజల కోసం ఏర్పాటు చేసిన ఫోరం మాత్రమే కొత్త పార్టీ ప్రచారంపై క్లారిటీ ఇచ్చిన డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు




**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** టీడీపీ నేత, ఆంధ్రప్రదేశ్ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామ కృష్ణరాజు తన కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటు చేస్తున్నారనే ప్రచారాన్ని పూర్తిగా ఖండించారు. గత రెండు మూడు రోజులుగా సోషల్ మీడియాలో, రాజకీయ వర్గాల్లో జరుగుతున్న ప్రచారంపై స్పందిస్తూ ఆయన స్పష్టత ఇచ్చారు. తాను రాజకీయ పార్టీ పెట్టబోతున్నానంటూ కొందరు కావాలనే తప్పుడు ప్రచారం చేస్తున్నారని రఘురామకృష్ణంరాజు మండిపడ్డారు. ప్రజలకు ఉచిత న్యాయ సహాయం అందించేందుకు మాత్రమే 'తెలుగువీర లేవరా' పేరుతో ఒక ఫోరం ఏర్పాటు చేశామని తెలిపారు. కొంతమంది న్యాయవాదులతో కలిసి ఈ ఫోరమ్‌ను ప్రారంభించామని చెప్పారు. ప్రత్యేకంగా తప్పుడు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న

మిగతా .. 2లో..

తిరుపతి యాత్రికులకు శుభవార్త..

## చర్లపల్లి నుంచి రెండు కొత్త వీక్లీ రైళ్లు!

- ★ మే 29 నుంచి చర్లపల్లి - తిరుపతి మధ్య రెగ్యులర్ సర్వీస్ ప్రారంభం
- ★ ఇటీవలే ప్రారంభమైన చర్లపల్లి - తిరుచానూరు వీక్లీ ఎక్స్‌ప్రెస్
- ★ తిరుమల యాత్రికుల సౌకర్యార్థం రైల్వే శాఖ కీలక నిర్ణయం
- ★ తిరుచానూరు సర్వీసును ప్రారంభించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



**తిరుపతి, విశ్వం వాయిస్ న్యూస్ :** హైదరాబాద్ నుంచి తిరుపతికి ప్రయాణించే యాత్రికులకు, ప్రయాణికులకు భారతీయ రైల్వే శాఖ శుభవార్త అందించింది. తెలంగాణ నుంచి తిరుమల వెళ్లే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని, చర్లపల్లి రైల్వే టెర్మినల్ నుంచి తిరుపతి ప్రాంతానికి రెండు వేర్వేరు వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైళ్లను రైల్వే మంత్రిత్వ శాఖ ఆమోదించింది. ఈ నిర్ణయంతో ప్రయాణికుల ప్రయాణ కష్టాలు తీరనున్నాయి. చర్లపల్లి - తిరుపతి వీక్లీ ఎక్స్‌ప్రెస్ (17444/17443) ఇప్పటికే ప్రత్యేక రైలుగా నడుస్తున్న సర్వీసును రైల్వే శాఖ క్రమబద్ధీకరించి, చర్లపల్లి - తిరుపతి మధ్య

మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

# ఇల్ నెస్ నుంచి వెల్ నెస్ దిశగా ఏపీ

క్యూరెటివ్ అనే మూడు సూత్రాల ఆధారంగా ఈ వ్యవస్థ పని చేస్తుందని సీఎం అన్నారు. ముందస్తుగా గుర్తించటం, వ్యాధి రాకముందే నివారణ, చికిత్సల ద్వారా ప్రజారోగ్యాన్ని కాపాడతామని స్పష్టం చేశారు. వ్యక్తిగత డిజిటల్ హెల్త్ రికార్డులను వైద్యులు నిరంతరం పర్యవేక్షించేలా ఈ వ్యవస్థ సేవలందిస్తుందని వెల్లడించారు. కుప్పంలో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభమైన సంజీవని కార్యక్రమం... ఈ ఏడాది మార్చి నుంచి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా అమల్లో ఉందని.... ఈ ఏడాది ఆగస్టు 15 నుంచి ఈ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలని నిర్ణయించామని ముఖ్యమంత్రి ప్రకటించారు. 42 వైద్య పరీక్షలను ఇంటి వద్దే నిర్వహించి రిపోర్టులు ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. ప్రజారోగ్యానికి అవసరమైన ప్రతీ అంశాన్ని సంజీవని ప్రాజెక్టు ద్వారా పర్యవేక్షిస్తామని తెలిపారు. డాక్టర్ అప్పాయింట్మెంట్, వర్చువల్ కనెక్ట్ ద్వారా వైద్య సలహాలు, సంజీవని కార్డు ద్వారా డిజిటల్ హెల్త్ రికార్డుల పర్యవేక్షిస్తామని వివరించారు. త్వరలోనే ఏఐ డాక్టర్ ద్వారా వైద్య సేవలు పొందేలా చర్యలు చేపడుతున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు.

**వైద్యరంగానికి ఎక్కువ నిధులు**

వైద్య ఖర్చులు భరించలేక కుటుంబాలు ఆర్ధికంగా చితికిపోయాయని, ఆ ఇబ్బందులను తప్పించడానికే ప్రజా ప్రభుత్వం సంజీవనిలాంటి వినూత్న ప్రాజెక్టు తీసుకువచ్చిందని అన్నారు. రాష్ట్రంలో విద్య-వైద్య రంగాలకు ప్రజా ప్రభుత్వం ఎప్పుడూ అధిక ప్రాధాన్యత ఇస్తుందని వివరించారు. మెరుగైన ప్రజారోగ్యం కోసం ఉద్యమం చేపట్టామని అన్నారు. ఈసారి బడ్జెట్ లో వైద్యారోగ్య రంగానికి రూ.19,305 కోట్లు కేటాయించినట్టు వివరించారు. 15వ ఆర్థిక సంఘం నుంచి అత్యధికంగా రూ.2,601 కోట్ల ఆరోగ్య గ్రాంట్లు పొందిన రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని తెలిపారు. యూనివర్సల్ హెల్త్ పాలసీ కింద రాష్ట్రంలో పేదా ధనికా తేడా లేకుండా ప్రతీ ఒకొక్కరికి రూ. 2.50 లక్షల విలువైన వైద్య సేవలు అందిస్తామన్నారు. రూ. 25 లక్షల వరకూ ఎన్టీఆర్ వైద్య సేవ, సీఎం రిలీఫ్ ద్వారా వైద్య ఖర్చులు భరించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. పేదలకు సైతం మెరుగైన వైద్యం అందించేందుకు... ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్ని ఖాళీలు భర్తీ చేస్తున్నామని వివరించారు. మంచి అలవాట్లు, ఆహారం, వ్యాయామం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సీఎం పిలుపునిచ్చారు. ఆహారమే ఔషధం - వంటశాలే ఔషధ శాల అని మరోమారు సీఎం స్పష్టం చేశారు. ప్రజారోగ్యంతో పాటు వారి భవిష్యత్తు కోసం ప్రజా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని ముఖ్యమంత్రి వివరించారు.

**శ్రీశైలం మల్లన్న నుంచి తిరుపతి వెంకన్న వరకూ కృష్ణా నీరు**

సమాజంలో ప్రతీ ఒక్కరూ పర్యావరణాన్ని పరిరక్షించటంతో పాటు ప్రతీ నీటి బొట్టునూ సంరక్షించుకోవాల్సిన అవసరం ఉందని సీఎం తెలిపారు. రాష్ట్రంలో సమర్థ నీటి నిర్వహణ ద్వారా జలనవరుల్ని కాపాడుతున్నామని... భూగర్భ జలాలు కూడా పెంచగలిగామని తెలిపారు. సముద్రంలో వృథాగా పోయే జలాలను సద్వినియోగం చేసుకుంటూ ప్రాజెక్టులు, రిజర్వాయర్లు, చెరువులు అన్నింటినీ నింపగలిగామని వివరించారు. హంద్రీ-నీవా కాలువతో రాయలసీమ జిల్లాల్లోని చివరి ప్రాంతాలకు నీరు తీసుకెళ్లామని అన్నారు. అన్నమయ్య జిల్లాలో ప్రభుత్వ యంత్రాంగం తీసుకున్న చర్యలతో భూగర్భ జలాలు పెరిగాయని, ఈ కారణంగానే అక్కడ పచ్చదనం పెరిగి ఉష్ణోగ్రతలు తగ్గినట్టు నివేదికలు చెబుతున్నాయని సీఎం అన్నారు. ఎల్ నినో ప్రభావంతో ఉష్ణోగ్రతలు తీవ్రస్థాయిలో నమోదు అవుతున్నాయని పిడుగురాళ్లలో 49 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డు అయ్యిందని అన్నారు. వర్షపాతం తక్కువ కురుస్తుందన్న అంచనాలు ఉన్న నేపథ్యంలో నీటిని పొదుపుగా వాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల పూర్తి చేసే సంకల్పంతో ఉన్నామని దీనిపై ఇప్పటికే క్యాలెండర్ విడుదల చేసినట్టు తెలిపారు. నీవా పనులు పూర్తి చేసి పూతలపట్టు మీదుగా చిత్తూరు వరకు కృష్ణా నీటిని తీసుకు వస్తామన్నారు. శ్రీశైలం మల్లన్న నుంచి తిరుపతి వెంకన్న వరకూ నీటిని తరలిస్తామని చెప్పారు. గాలేరు-నగరి కోడూరు వరకు, మల్లె మడుగు బాలాజీ రిజర్వాయర్- 2028 డిసెంబర్ నాటికి పూర్తి చేస్తామన్నారు. సోమశిల, స్వర్ణముఖి లింక్ కెనాల్-జూన్ 2028 పూర్తి అవుతుందన్నారు.

**రాయలసీమ ఇక ఫైటర్ జెట్ల తయారీ కేంద్రం**

23 నెలల్లో 23 లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకువచ్చామని... రాష్ట్రంలోని 23 లక్షల మందికి యువతకు ఉద్యోగాలు వస్తాయని సీఎం స్పష్టం చేశారు. రాయలసీమలోని పుట్టపర్తిలో 5 జనరేషన్ యుద్ధ విమాన తయారీ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశామని... యుద్ధాల్లో పాల్గొనే జెట్ ఫైటర్ యుద్ధ విమానాల తయారీ కేంద్రంగా పుట్టపర్తి మారబోతోందని సీఎం అన్నారు. రాయలసీమను డిఫెన్స్ హబ్ గా చేస్తామన్నారు. యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించటమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమన్నారు. విశాఖలో గూగుల్ డేటా సెంటర్, కర్నూలులో డ్రోన్, అనంతపురంలో ఏరోస్పేస్, స్పేస్ సిటీ, ఎలక్ట్రానిక్ సిటీ లాంటివి ఏర్పాటు కానున్నాయని వివరించారు. తిరుపతిలోనే త్వరలోనే బుల్లెట్ మోటార్ సైకిల్ తయారీ పరిశ్రమ ఏర్పాటు కాబోతోందన్నారు. రాయలసీమలో ఉక్కు పరిశ్రమ, సిమెంట్ ఫ్యాక్టరీలతో పాటు వచ్చే నెల కర్నూలో బంగారం ఉత్పత్తి చేసే గనుల్ని కూడా ప్రారంభించబోతున్నట్టు సీఎం తెలిపారు. రూ. 1 లక్ష కోట్లతో రాయలసీమలో ఉద్యాన పంటలను అభివృద్ధి చేస్తాం. ప్రభుత్వం నుంచి రూ.40 వేల కోట్లు, రూ. 60 వేల కోట్ల ప్రైవేటు పెట్టుబడులు కూడా వస్తాయన్నారు. పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా గ్యాస్ కొరత, పెట్రోలు డీజిల్ ధరలు పెరిగినా... సమస్య తాత్కాలికమేనని అన్నారు. మహిళల కోసం కూటమి సర్కారు తల్లికి వందనం, స్త్రీశక్తి, దీపం 2 లాంటి పథకాలు అమలు చేసిందన్నారు. వన్ ఫ్యామిలీ వన్ ఎంటర్ ప్రెన్యూర్ తో పాటు చట్ట సభల్లో మహిళా రిజర్వేషన్ల సాధన లక్ష్యంగా పనిచేస్తున్నామని అన్నారు. మహిళలపై జరిగే నేరాల విషయంలో కఠినంగా వ్యవహరిస్తామన్నారు.

**గొడ్డలి పార్టీ గంగవెర్రులెత్తుతోంది**

రాష్ట్రంలో సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్ కావటంతో పాటు కూటమి చేపట్టిన అభివృద్ధి ప్రాజెక్టులను చూసి గొడ్డలి పార్టీ గంగవెర్రులెత్తుతోందని సీఎం వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో ప్రజల ప్రాణాలు కాపాడే రాజకీయాలు ఒకవైపు ప్రజల్ని భయపెట్టే మోసం చేసే రాజకీయాలు ఇంకోవైపు ఉన్నాయని ప్రజలు జాగ్రత్తగా గమనించాలని అన్నారు. నోరు తెరిస్తే అబద్ధాలు చెబుతున్న వ్యక్తులు మీడియా ముందుకొచ్చి మంచోడినంటూ మాటలు చెబుతున్నారని.. ఇది గొడ్డలి పార్టీ నైజమని అన్నారు. వైసీపీ చేసిన 11 నిర్వాకాలను, అరాచక ఘటనలను సీఎం ప్రజలకు వివరించారు. ప్రజాస్వామ్యంలో గొడ్డలి పార్టీలకు చోటులేదని..సమాజానికి గొడ్డలి పార్టీ హానికరమని.. గొడ్డలి పార్టీ నెవర్ ఎగైన్ అంటూ ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. ఈ అంశాలపై సీఎం మాట్లాడుతూ.. 1.వివేకా హత్యలో నాటకాలు ఆడారు, నంగనాచి కబుర్లు చెప్పారు - అంతిమ లబ్ధిదారు ఎవరనేది...ప్రతి ఒక్కరికీ తెలుసు. 2.కోడికత్తి డ్రామా... గులకరాయి డ్రామా ప్రజలందరికీ జ్ఞాపకం ఉంది. ప్రజలను మోసం చేసే ఎత్తుగడ, దుర్మార్గానికి పరాకాష్ఠ. 3.దళిత డ్రైవర్ సుబ్రమణ్యం హత్య, డోర్ డెలివరీ చేసిన నిందితుడికి అండదండలు ఇచ్చారు. 4.మాస్క్ అడిగిన దళిత డాక్టర్ సుధాకర్ పై పై దాడి చేశారు, వేధించి ప్రాణాలు తీశారు. 5.కుటుంబ బంధాలపై గొడ్డలి వేటు వేశారు. ఆస్తి ఇవ్వకుండా తల్లికి, చెల్లికి అన్యాయం చేశారు. ఇంట్లో న్యాయం చేయకుండా బయట ఎలా న్యాయం చేస్తాడు. 6. హిందూ దేవుళ్లపై దాడులు చేశారు. అపవిత్ర కార్యక్రమాలు, కుట్రలు. తప్పుడు ప్రచారాలు చేశారు. 7. పోలవరం, అమరావతి, పెట్టుబడులు, అభివృద్ధిపై గొడ్డలి పార్టీ వేటు వేసింది. 8.నందం సుబ్బయ్య, చంద్రయ్య, జల్లయ్యల పీకలు కోసి నడిరోడ్డుపై చంపేసి రక్తదాహం తీర్చుకున్నారు. 9.గంజాయి బ్యాచ్ లకు ప్రోత్సాహం ఇచ్చారు. వాళ్ల కార్యకర్తలు రప్పా రప్పా రంకెలు వేశారు. జంతు రక్తంతో కటౌట్ కు అభిషేకాలు చేశారు. 10. కారు కింద వారి పార్టీ కార్యకర్త సింగయ్యను తొక్కించారు... కడపలో పెద్ద దస్తగిరిని చంపేశారు. 11.కులాలు, మతాలు, ప్రాంతాల మధ్య చిచ్చుకు రోజుకో నాటకం. పాస్టర్లతో దాడి డ్రామాలు చేస్తూనే ఉన్నారు. " అని సీఎం వ్యాఖ్యానించారు. 5 ఏళ్ల పాటు రాష్ట్రంలో ప్రతి ఒక్కరికి నిద్ర లేకుండా చేశారు. ప్రజలకు నరకం చూపించారన్నారు. కనీసం నోటీసు కూడా ఇవ్వకుండా తనను అరెస్టు చేసి జైల్లో పెట్టారని ఆరోపించారు. ప్రజలందరిలోనూ భయాందోళనలు కల్పించారని అన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వస్తూనే స్వేచ్ఛ కల్పించామని సీఎం స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం హెల్తీ వెల్తీ హ్యాపీ ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా పనిచేస్తుందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రజా వేదిక ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను ముఖ్యమంత్రి చంద్రబాబు పరిశీలించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఇంఛార్జి మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే మురళి ఇతర ప్రజాప్రతినిధులు, వైద్యారోగ్యశాఖ, చిత్తూరు జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# మరింత బలోపేతం

తమ దేశంలో 20 బిలియన్ డాలర్లకు పైగా పెట్టుబడులు పెట్టాయని తెలిపారు. భారత్‌కు ముడి చమురు సరఫరా చేయడానికి తమ దేశం సిద్ధంగా ఉందన్నారు. అదే సమయంలో ప్రపంచ ఇంధన మార్కెట్‌ను తన ఆధీనంలోకి తీసుకోవడానికి ఇరాన్ చేస్తున్న ప్రయత్నాలను తాము ఎప్పటికీ అంగీకరించబోమన్నారు. ప్రధాని మోదీకి, ట్రంప్‌నకు మధ్య మంచి స్నేహపూర్వక సంబంధాలు ఉన్నాయని రూబియో అన్నారు. వారిద్దరూ కేవలం తాత్కాలిక ప్రయోజనాల గురించే కాకుండా దీర్ఘకాలిక ప్రయోజనాలపైనా దృష్టిపెడతారని పేర్కొన్నారు. ఈ క్రమంలో దేశంలో మండుతున్న ఎండల గురించి మాట్లాడుతూ.. వేడిగా ఉన్నందున తన ప్రసంగాన్ని క్లుప్తంగా ముగించాలనుకుంటున్నానంటూ చమత్కరించారు.

**ప్రపంచ శ్రేయస్సు కోసం కలిసి పనిచేస్తాం: ప్రధాని మోదీ**

అమెరికా విదేశాంగ మంత్రి రూబియోతో భేటీపై ప్రధాని మోదీ స్పందించారు. భారత్-అమెరికా వ్యూహాత్మక భాగస్వామ్యం పురోగతితోపాటు ప్రాంతీయ, అంతర్జాతీయ శాంతి భద్రతలు తదితర అంశాలపై చర్చలు జరిపామన్నారు. భవిష్యత్తులో ఇరుదేశాల మధ్య బంధం మరింత బలపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రపంచ శ్రేయస్సు కోసం అమెరికాతో కలిసి పని చేస్తామన్నారు. ఇరాన్‌తో నెలకొన్న ఉద్రిక్తతలను పరిష్కరించుకోవడానికి శాంతియుత చర్చలు జరపాలని ఈ సందర్భంగా ప్రధాని సూచించారు.

# ఎమ్మెల్యే అరవ శ్రీధర్ రాజీనామా

ఆరోపణలు, నెలకొన్న వివాదాలపై వివరణ ఇచ్చారు. పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు సైతం పవన్ కల్యాణ్‌ను కలిశారు. ఎమ్మెల్యే బాలరాజు పనితీరుపై పవన్ సమీక్ష జరిపారు. పార్టీ దృష్టికి వచ్చిన విషయాలపై ఎమ్మెల్యేను వివరణ కోరారు. వచ్చిన ఆరోపణలు, ఫిర్యాదులను 4 వారాల్లో చక్కదిద్దుకోవాలని సూచించారు. అదేవిధంగా నియోజకవర్గానికి ఇచ్చిన రూ.147 కోట్ల పనుల పురోగతిని ఆరా తీశారు. పనులు ఎందుకు పూర్తి కాలేదని ఎమ్మెల్యేను ప్రశ్నించారు. అధికారుల సమన్వయంతో పనులు వేగంగా పూర్తి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

# పదేళ్ల బాలిక హత్యోదంతం

కఠిన శిక్ష పడేలా చేస్తామని హామీ ఇచ్చారు. టీవీకే ఎమ్మెల్యే ఎన్ఎం కుమార్ ఆసుపత్రి వద్ద బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

**రాజకీయంగా దుమారం..**

చిన్నారి హత్య ఘటన రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర దుమారం రేపింది. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 12 రోజుల్లోనే రాష్ట్రంలో నేరాల గ్రాఫ్ పెరిగిందని డీఎంకే విమర్శలు గుప్పించింది. ఈ ఘటన రాష్ట్రంలోని శాంతిభద్రతలపై తీవ్ర సందేహాలను రేకెత్తిస్తోందని ప్రతిపక్ష నేత ఉదయనిధి స్టాలిన్ అన్నారు. బాలిక హత్యకు బాధ్యులైనవారిని వీలైనంత త్వరగా న్యాయస్థానం ముందు నిలబెట్టి.. కఠిన శిక్ష విధించాలని డిమాండ్ చేశారు. మహిళలకు భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చి విజయ్ అధికారంలోకి వచ్చారని.. ఇప్పుడు వారికి భద్రత ఎక్కడుందని ప్రశ్నించారు. ఈ ఘటనపై భాజపా నేత నారాయణన్ తిరుపతి మాట్లాడుతూ.. ఎంకే స్టాలిన్ నేతృత్వంలోని గత ప్రభుత్వం రాష్ట్రంలో శాంతిభద్రతలను పూర్తిగా నాశనం చేసిందని దుయ్యబట్టారు. ప్రభుత్వాలు మారుతున్నప్పటికీ ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటూనే ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కోయంబత్తూర్‌లోని కణ్ణపాళైయానికి చెందిన 10 ఏళ్ల బాలిక గురువారం సాయంత్రం దుకాణానికి వెళ్లి అదృశ్యమైంది. తల్లిదండ్రులు పలుచోట్ల వెతికినా ఆచూకీ లభ్యంకాలేదు. శుక్రవారం ఓ చెరువులో బాలిక మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. ఓ వ్యక్తి బాలికను బైక్‌పై ఎక్కించుకొని వెళ్లినట్లు విచారణలో తేలడంతో అతడితో పాటు మరో అనుమానితుడిని అరెస్ట్ చేసి విచారిస్తున్నారు.

# ఇరాన్‌పై మరోసారి దాడులకు అమెరికా సన్నద్ధం

కీలక అధికారులతో ట్రంప్ శుక్రవారం ఉన్నతస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఇందులో ఇరాన్‌పై తదుపరి తీసుకోవాల్సిన చర్యల గురించి వారితో చర్చించినట్లు తెలుస్తోంది. ఇరాన్‌తో చర్చలు విఫలమైతే.. వెంటనే సైన్యాన్ని రంగంలోకి దించే విషయం గురించి వారు మాట్లాడుకున్నారని అధికార వర్గాలు తెలిపాయి. అయితే, దాడులకు సంబంధించి ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని వెల్లడించాయి. ఈ సమావేశం అనంతరం వైట్‌హౌస్ అధ్యక్షుడి కార్యక్రమాలకు సంబంధించి కీలక మార్పులు చేసినట్లు తెలుస్తోంది. మెమోరియల్ డే సందర్భంగా న్యూజెర్సీకి వెళ్లాలని ట్రంప్ తొలుత నిర్ణయించుకున్నారు. అయితే, దాన్ని రద్దు చేసుకున్న ఆయన వైట్‌హౌస్‌లోనే ఉండనున్నారు.

**నా కుమారుడి పెళ్లికి వెళ్లడం లేదు: ట్రంప్**

ఇరాన్‌పై దాడులకు అమెరికా సన్నద్ధమవుతుందనే వార్తల నేపథ్యంలోనే ట్రంప్ కీలక ప్రకటన చేశారు. తన కుమారుడు డొనాల్డ్ ట్రంప్ జూనియర్ వివాహానికి హాజరుకావడం లేదన్నారు. ట్రంప్ జూనియర్, బెట్టినా ఆండర్సన్‌ల పెళ్లి చూడాలని తనకు ఎంతో ఆశగా ఉందంటూ అధ్యక్షుడు ట్రూత్‌సోషల్‌లో పోస్టు పెట్టారు. అయితే, ప్రభుత్వ కార్యక్రమాల వల్ల తాను అక్కడికి వెళ్లలేకపోతున్నానని తెలిపారు. ఈ కీలక సమయంలో తాను వైట్‌హౌస్‌లోనే ఉండటం అత్యంత ముఖ్యమని భావిస్తున్నట్లు వెల్లడించారు.

# గోదావరి పుష్కరాల పనులకు రూ. వెయ్యి కోట్లు..

మంజూరు చేయనున్నట్లు మంత్రి పొంగులేటి తెలిపారు. క్యూర్ పరిధిలో (హైదరాబాద్ కోర్ అర్బన్ ఏరియా) ఇందిరమ్మ ఇళ్ల కోసం సుమారు 7 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారని.. స్థలాలు ఉన్న 18,500 మందికి ఈ నెలాఖరు వరకు ప్రొసీడింగ్స్ ఇస్తామని వెల్లడించారు. కరీంనగర్ జిల్లాలో అస్సాం రైఫిల్స్, బీఎస్ఎఫ్, సీఐఎస్ఎఫ్ గ్రూప్ సెంటర్ల ఏర్పాటుకు 14 ఎకరాల కేటాయింపునకు ఆమోదం. వెలిదిలో 4, రుక్మాపూర్‌లో 5, గన్నేరువరం మండలంలో 5 ఎకరాల చొప్పున కేటాయింపు, కేసముద్రం ఫైర్‌స్టేషన్‌కు 18 పోస్టుల మంజూరుకు అంగీకారం, కరీంనగర్ జిల్లా గంగాధరలోని నూతన డిగ్రీ కళాశాలలో 20 రెగ్యులర్ టీచింగ్, ఆరు నాన్‌టీచింగ్, అవుట్‌సోర్సింగ్ పద్ధతిన మూడు పోస్టుల మంజూరుకు నిర్ణయం, 2026-30 లైఫ్ సైన్సెస్ పాలసీకి కేబినెట్ ఆమోదం, డీసీఎంఎస్‌లను మార్క్‌ఫెడ్‌లో, తెలంగాణ రూరల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్‌ను హాకాలో విలీనం చేయాలని నిర్ణయం, ఆర్‌డీఎస్ఎస్‌లో చేరేందుకు డిస్కంల ప్రతిపాదనలకు కేబినెట్ ఆమోదం, పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి రూ.587 కోట్లు కేటాయింపు.

# తెలుగు రాష్ట్రాల్లో గాలివాన బీభత్సం

వర్షం అల్లకల్లోలం సృష్టించింది. గాలివాన బీభత్సం కారణంగా ఏపీలో ఇద్దరు, తెలంగాణలో ఒకరు మృత్యువాత పడ్డారు. పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అనకాపల్లి జిల్లా నక్కపల్లి, పాయకరావుపేట మండలాల్లో దాదాపు అరగంట పాటు గాలి, వాన రావడంతో చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. రమణయ్యపేట, ముకుందరాజుపేట, దోసలపాడు, చీడిక, జి.జగన్నాథపురం, గొడిచర్ల, డొంకాడ, చినదొడ్డిగల్లు, కాగిత జాతీయ. రహదారి వంటి గ్రామాల్లో ఇళ్లు దెబ్బతిన్నాయి. సత్యవరం గ్రామంలో కొబ్బరిచెట్లు నేలకూలి తమలపాకులు సేకరించే ఇద్దరు కూలీలు ప్రాణాలు కోల్పోయారు. ముకుందరాజుపేటలో ఇంటి రేకులు పడి ఇద్దరు మహిళలకు గాయాలయ్యాయి. గాలుల ప్రభావంతో భారీగా ఆస్తి నష్టం వాటిల్లింది. మామిడి, అరటి పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. కాకినాడ జిల్లా తుని ప్రాంతంలో భారీ ఈదురుగాలులకు తలుపులమ్మ తల్లి లోవ ఆలయ మార్గంలో కారుపై చెట్లు విరిగిపడ్డాయి. ఈ ఘటనలో ఎవరికీ ఏమీ కాలేదు. మరోవైపు, తెలంగాణలోని నాగర్ కర్నూలు జిల్లా తాడూరు మండలం గోవిందాయిపల్లిలో పిడుగుపాటుకు ఒక గొర్రెల కాపరి మృతి చెందాడు. అచ్చంపేటలో భారీ వర్షం కారణంగా ధాన్యం తడిసిపోయింది.

# ఫ్యాక్షన్ రాజకీయం మొదలైంది

కాబట్టే.. వాస్తవాలు గుర్తుచేస్తున్నామని పయ్యావుల కేశవ్ వెల్లడించారు. పులివెందుల పరిణామాలపై ఓ పుస్తకం విడుదల చేసే యోచనలో ఉన్నామని తెలిపారు. గొడ్డలి పార్టీ వల్ల సమాజంలో తరాలు నష్టపోతున్నాయి కాబట్టే సమాజానికి ఆపార్టీ హానికరమని గట్టిగా చెబుతున్నామన్నారు. శాంతి భద్రతలు, పరిశ్రమలు, రాజ్యాంగ వ్యవస్థలన్నింటి మీదా గొడ్డలి వేటు వేసిన పార్టీ కాబట్టే జగన్ ది గొడ్డలి పార్టీ అని ధ్వజమెత్తారు. జగన్ తనంత మంచోడు లేడంటూ తనకు తాను సెల్ఫ్ సెర్టిఫికేట్ ఇచ్చుకోవటం విడ్డూరమని వ్యాఖ్యానించారు. బాబాయ్ హత్య వెనుక ఎవరు ఉన్నారో జగన్ చెల్లి సహా రాష్ట్రంలో నిక్కర్ వేసుకున్న చిన్న పిల్లాడు కూడా చెబుతారన్నారు.

# రాజమండ్రిలో పవన్ టూర్.. ఎల్లుండి పడవ ప్రయాణం!

చేయనున్నారు. సోమవారం ఉదయం పుష్కర్ ఘాట్ నుంచి కోటిలింగాల ఘాట్ వరకు పడవలో ప్రయాణించి పుష్కరాలకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలిస్తారు. అనంతరం రాజమహేంద్రవరం కార్పొరేషన్ కార్యాలయంలో అధికారులు, ప్రజాప్రతినిధిలతో సమావేశమవుతారు. పవన్ కల్యాణ్ పర్యటన నేపథ్యంలో, ఈ పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను ఈరోజు మంత్రి కందుల దుర్గేశ్, కలెక్టర్ కీర్తి చేకూరి పరిశీలించారు. అనంతరం మంత్రి దుర్గేశ్ మాట్లాడుతూ, గోదావరి పుష్కరాలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. గోదావరి పుష్కరాలకు తరలివచ్చే భక్తులకు పూర్తి భద్రత కల్పిస్తామని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన బందోబస్తును ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. కాలుష్యరహిత పుష్కరాల నిర్వహణకు చర్యలు చేపట్టినట్లు మంత్రి తెలిపారు.

# జీపులతో హంగామా కేసులో ఇద్దరికి రిమాండ్

ఇద్దరు థార్ జీపులతో బీభత్సం సృష్టించిన విషయం తెలిసిందే. వారిద్దరు తమ థార్ జీపులతో నడిరోడ్డుపై ఢీకొట్టుకుంటూ వాహనదారులను భయాందోళనకు గురి చేశారు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని వైద్య పరీక్షలు నిర్వహించగా, బొల్లా ఓం డ్రగ్స్ సేవించినట్లు తేలింది. మద్యం మత్తు వల్లే నిందితుడు రోడ్డుపై కార్ల ఢీకి పాల్పడ్డాడని పోలీసులు తేల్చారు. అయితే నడిరోడ్డుపై ఈ హైడ్రామా సృష్టించింది ఒక యువతి కోసమని పోలీసుల ప్రాథమిక విచారణలో వెల్లడైంది. ఒక అమ్మాయి కోసం వీరిద్దరు గొడవపడి ఒకరి జీపును మరొకరు ఢీకొట్టుకుంటూ గందరగోళం సృష్టించారు.

# చంద్రబాబుతోనే సీమ అభివృద్ధి

ఘనత సీఎం చంద్రబాబుదేనన్నారు. మంత్రి నారా లోకేశ్ గురించి మాట్లాడే అర్హత జగన్ కు లేదన్నారు. పెనుకొండ పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి సవిత మాట్లాడారు. తాడేపల్లి ప్యాలెస్‌లో శుక్రవారం నిర్వహించిన జగన్ ప్రెస్ మీట్ ను చూసి జనాలు నవ్వుకుంటున్నారన్నారు. మహాత్మా గాంధీ, గౌతమ బుద్ధుడిలా జగన్ రెడ్డి శాంతి వచనాలు పఠించడం చూసి, చిన్న పిల్లలతో పాటు రాజకీయ అవగాహన లేని వారు సైతం నవ్వుతున్నారన్నారు. రాయలసీమలో ఫ్యాక్షన్ కు నాందిపలికింది రాజారెడ్డి అని ఆరోపించారు. జగన్, ఆయన తండ్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి, తాత రాజారెడ్డి చరిత్ర అందరికీ తెలిసిందేనన్నారు.. ఫ్యాక్షన్ నైజంతో రాయలసీమలో రక్తం ఏరులై పారించారని, వారి రక్త దాహానికి బడుగు, బలహీన వర్గాల వారు, రాజకీయ ప్రత్యర్థులు బలైపోయారని అన్నారు. శవ రాజకీయాలు చేయడంలో జగన్ తరవాతే ఎవరైనా అని వైసీపీ నేత బొత్స సత్యనారాయణ గతంలో అనలేదా..? అని ప్రశ్నించారు. తండ్రి శవాన్ని రాజకీయ ఉనికి కోసం ఉపయోగించుకోలేదా..? అని జగన్ ను మంత్రి సవిత నిలదీశారు. తల్లిని, చెల్లెళ్లను సైతం ఏడిపిస్తున్నారని మండిపడ్డారు. బాబాయ్ హంతకులు, దళిత సామాజిక వర్గానికి చెందిన డ్రైవర్ సుబ్రహ్మణ్యాన్ని పొట్టన బెట్టుకున్న వ్యక్తి వైసీపీలోనే ఉన్నారని మండిపడ్డారు. ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్ అయిదేళ్ల పాటు రాష్ట్ర ప్రజలను తీవ్ర ఇబ్బందులు పాల్జేశారన్నారు. జగన్ గాని, ఆయన తాత రాజారెడ్డిగాని, తండ్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డిగాని రాయలసీమకుగాని, పులివెందుల అభివృద్ధికి గాని ఏం చేశారు..? అని మంత్రి సవిత నిలదీశారు. అన్నమయ్య డ్యామ్ కొట్టుకుపోయిన ఘటనలో అధికారంలోకి ఉండి కూడా జగన్ ఏమీ పట్టించుకోలేదని మంత్రి సవిత ఆగ్రహం వ్యక్తం చేశారు.

**చంద్రబాబుతోనే రాయలసీమ అభివృద్ధి**

రాయలసీమ అభివృద్ధికి సీఎం చంద్రబాబునాయుడు అహర్నిశలూ కృషి చేస్తున్నారని మంత్ర సవిత కొనియాడారు. కియాలాంటి అంతర్జాతీయ కార్ల పరిశ్రమను తీసుకొచ్చారన్నారు. రాయల్ ఎన్ ఫీల్డ్ పరిశ్రమతో పాటు ఏరో స్పెస్ పరిశ్రమను నెలకొల్పుతున్నారన్నారు. హార్టీకల్చర్ హబ్ గా, సోలార్ హబ్ గా, పారిశ్రామిక హబ్ గా రాయలసీమను అభివృద్ధి చేస్తున్నారన్నారు. రాయలసీమలో ఫ్యాక్షనిజాన్ని అంతమొందించి, ఇక్కడి బిడ్డలను ఇంజనీర్లుగా, డాక్టర్లుగా, ఐటీ ఉద్యోగులుగా తీర్చిదిద్దిన ఘనత కూడా సీఎం చంద్రబాబునాయుడిదేనన్నారు. రాయలసీమలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి అధిక నిధులు కేటాయిస్తున్నారన్నారు. సీఎం చంద్రబాబునాయుడు రాయలసీమ అభివృద్ధి ప్రదాత అయితే, జగన్ ద్రోహిగా నిలబడ్డారన్నారు.

**...ఆ అర్హత జగన్‌కు లేదు**

కూటమి ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్లలో రాష్ట్రంలో అభివృద్ధితో పాటు సంక్షేమానికి అధిక ప్రాధాన్యమిస్తున్నామని మంత్రి సవిత తెలిపారు. రాష్ట్ర ఐటీ, విద్య శాఖ మంత్రి నారా లోకేశ్ రాష్ట్రాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. రాష్ట్రానికి రూ.25 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు రావడంలో మంత్రి నారా లోకేశ్ కీలకంగా వ్యవహరించారన్నారు. గాడితప్పన విద్య వ్యవస్థను ప్రక్షాళన చేసి, ఏపీ విద్యా వ్యవస్థను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దుతున్నారన్నారు. దేశంలోనే ఏపీని అగ్ర పథాన నిలుపుతున్న మంత్రి నారా లోకేశ్ గురించి మాట్లాడే అర్హత జగన్ కు లేదని మంత్రి సవిత తేల్చి చెప్పారు. రాజకీయ ఉనికి కోసం జగన్ మరోసారి శవ రాజకీయాలకు తెరలేపారని, ఆయనను ఎవరూ పట్టించుకోవడం లేదని మంత్రి సవిత తెలిపారు.

**చెత్త ఊడ్చి... చేతులతో ఎత్తి...**

అంతకుముందు శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ పట్టణంలో నిర్వహించిన ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమంలో మంత్రి సవిత పాల్గొని చెత్త ఊడ్చారు. స్వయంగా మంత్రి తన చేతులతో చెత్త తీసి డస్ట్ బిన్ లో వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, క్లీన్ పెనుకొండ - గ్రీన్ పెనుకొండకు ప్రజలు సహకరించాలని పిలుపునిచ్చారు. పరిసరాల పరిశుభ్రతతోనే అభివృద్ధి సాధ్యమని నమ్మిన వ్యక్తి సీఎం చంద్రబాబునాయుడన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆపరేషన్ క్లీన్ స్వీప్ పేరుతో పారిశుధ్యం మెరుగుకు ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతి నెలా మొదటి వారంలో రోడ్లు, పబ్లిక్ ప్రదేశాల పరిశుభ్రత, రెండో వారంలో కాల్వల శుభ్రత, మూడో వారంలో చెత్త వేరు చేయడంపై అవగాహన, నాలుగో వారంలో పబ్లిక్ టాయిలెట్ల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు తెలిపారు. పట్టణాలు పరిశుభ్రంగా ఉండాలంటే ప్రభుత్వం ఒక్కటే కాదు ప్రజల భాగస్వామ్యం కూడా ఎంతో అవసరం. ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకునే బాధ్యత తీసుకోవాలి"అని మంత్రి సవిత పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

# అది రాజకీయ పార్టీ కాదు..

వారికి న్యాయ సలహాలు, మార్గదర్శకత్వం అందించడమే ఈ ఫోరమ్ ముఖ్య ఉద్దేశమన్నారు. తాను ఎదుర్కొన్న అనుభవాల దృష్ట్యా ఇతరులు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో ఈ వేదికను ఏర్పాటు చేసినట్లు వివరించారు. అల్లూరి సీతా రామ రాజు స్ఫూర్తితోనే 'తెలుగువీర లేవరా' అనే పేరును ఎంపిక చేశామని చెప్పారు. ఇది కేవలం సామాజిక, న్యాయ సేవల కోసం పనిచేసే ఫోరమ్ మాత్రమేనని, దీనికి రాజకీయ పార్టీతో ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. ఒక సొసైటీ లేదా ఫోరమ్ ఏర్పాటు చేస్తే వెంటనే పార్టీ పెడుతున్నారని ప్రచారం చేయడం సరైంది కాదన్నారు. కొందరు కావాలనే వాస్తవాలను వక్రీకరించి ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాను ప్రస్తుతం టీడీపీలో చాలా సంతోషంగా ఉన్నానని రఘురామకృష్ణంరాజు తెలిపారు. ముఖ్యమంత్రి తో పాటు పార్టీ నాయకత్వంతో తనకు మంచి సంబంధాలు ఉన్నాయని చెప్పారు. పార్టీలో తనకు పూర్తి గౌరవం లభిస్తోందన్నారు. కొత్త పార్టీ పేరు నమోదు చేశారంటూ వస్తున్న వార్తలు పూర్తిగా అసత్యమని ఆయన స్పష్టం చేశారు. ఈ ప్రచారానికి చెక్ పెట్టేందుకే తాను వీడియో విడుదల చేసి వివరణ ఇచ్చినట్లు తెలిపారు.

# చర్లపల్లి నుంచి రెండు కొత్త వీక్లీ రైళ్లు!

కొత్త వీక్లీ ఎక్స్‌ప్రెస్‌గా ప్రకటించింది. ఈ రైలు (నం. 17444) మే 29, 2026 నుంచి ప్రతి శుక్రవారం సాయంత్రం 4:20 గంటలకు చర్లపల్లిలో బయలుదేరి, మరుసటి రోజు ఉదయం 7:30 గంటలకు తిరుపతి చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో (నం. 17443), మే 28, 2026 నుంచి ప్రతి గురువారం సాయంత్రం 4:30 గంటలకు తిరుపతిలో ప్రారంభమై, మరుసటి రోజు ఉదయం 8:25 గంటలకు చర్లపల్లికి వస్తుంది. చర్లపల్లి - తిరుచానూరు వీక్లీ ఎక్స్‌ప్రెస్ (17059/17060) దీంతో పాటు, చర్లపల్లి - తిరుచానూరు మధ్య మరో కొత్త వీక్లీ ఎక్స్‌ప్రెస్‌ను కూడా ఇటీవలే ప్రారంభించారు. మే 17న కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి ఈ సర్వీసును జెండా ఊపి ప్రారంభించారు. ఈ రైలు (నం. 17059) ప్రతి ఆదివారం రాత్రి 9:30 గంటలకు చర్లపల్లిలో బయలుదేరి, సోమవారం మధ్యాహ్నం 12:30 గంటలకు తిరుచానూరు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో (నం. 17060) ప్రతి సోమవారం సాయంత్రం 4:00 గంటలకు తిరుచానూరులో బయలుదేరి, మంగళవారం ఉదయం 8:00 గంటలకు చర్లపల్లికి చేరుకుంటుంది. ఈ రైలులో రెండు ఏసీ 2-టైర్, ఏడు ఏసీ 3-టైర్, ఏడు స్లీపర్ క్లాస్, నాలుగు జనరల్ కోచ్‌లు ఉంటాయి. ఈ రెండు కొత్త రైలు సర్వీసులు తెలంగాణ నుంచి తిరుమల శ్రీవారి దర్శనానికి వెళ్లే భక్తులకు, ఇతర ప్రయాణికులకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటాయని అధికారులు భావిస్తున్నారు.

# ఎడిటర్ వాయిస్

## ఈ సారి కష్టమే మంత్రి మేడమ్..!

గత ఎన్నికల్లో విజయం దక్కించుకున్న కొందరు నాయకులు.. వచ్చే ఎన్నికలపై దృష్టి పెట్టారు. వచ్చే ఎన్నికల్లోనూ విజయం సాధించాలని కొందరు పట్టుదలతో ముందుకు సాగుతున్నారు. అయితే.. వీరి పరిస్థితి ఒక్కొక్క చోట ఒక్కొక్క రకంగా ఉంది. కొందరికి విజయం నల్లేరుపై నడక అన్నట్టుగా ఉంటే.. మరికొందరి పరిస్థితి ఇబ్బందిగా మారింది. అయితే.. ఈ పరిస్థితులను ఎదుర్కొనేందుకు కొందరు ప్రయత్నాలు చేస్తున్నారు.

ఇలాంటి వారిలో సాలూరు ఎమ్మెల్యే కమ్ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఒకరు. విజయనగరం జిల్లాలోని సాలూరు నియోజకవర్గం నుంచి విజయం దక్కించుకున్న ఆమె.. ఎస్టీ సమీకరణల్లో భాగంగా మంత్రి అయ్యారు. అయితే.. ప్రస్తుతం ఆమె గ్రాఫ్ అంతగా పుంజుకోవడం లేదని స్థానికంగా పెద్ద ఎత్తున టాక్ నడుస్తోంది. దీంతో గత రెండు మాసాలుగా స్థానికంగా తిష్ఠ వేశారు. నియోజకవర్గంలో కలియ దిరుగుతున్నారు.

ఇప్పుడున్న పరిస్థితిలో మంత్రులకు నిజంగానే తమ తమ నియోజకవర్గాలపై దృష్టి పెట్టడం ఇబ్బంది గానే ఉందన్నది వాస్తవం. ఒకవైపు మంత్రిగా బాధ్యతలు.. మరోవైపు ఇంచార్జ్‌గా ఉన్న జిల్లాల బాధ్యతలు వారికి ఊపిరి సలపడం లేదు. దీనికి తోడు.. సాలూరులో కుటుంబ రాజకీయాలు పెరిగిపోవడం.. మంత్రికి సెగ పెంచుతున్నాయి. ఇటీవల గ్రాఫ్‌లోనూ ఆమె వెనుకబడ్డారన్నది వాస్తవం. అంతేకాదు.. తన కుటుంబ సభ్యులపై విమర్శలు వచ్చాయి.

ఈ పరిణామాల నుంచి బయట పడేందుకు మంత్రిగా సంధ్యారాణి ఎదురు దాడి వ్యూహాన్ని ఎంచుకున్నారు. ఇదికూడా వర్కవుట్ కాలేదు. దీంతో ఇప్పుడు.. తానే స్వయంగా రంగంలోకి దిగారు. నియోజకవర్గంలో పాదయాత్ర సహా.. ప్రతి ఇంటి తలుపూ తడుతున్నారు. తన వర్గాన్ని మచ్చిక చేసుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. అంతేకాదు.. ఓటు బ్యాంకును కూడా పెంచుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. అయినా.. కూడా..



కుటుంబ రాజకీయ వ్యతిరేకత అయితే.. భారీగానే తగులుండడంతో ఈ సారికి కష్టం మేడమ్ అంటూ.. కొందరు వ్యాఖ్యలు చేస్తుండడం గమనార్హం.

ఎడిటర్ : కె.సునీల్‌కుమార్

# క్రైం వాయిస్

## న్యాయవాదిని కారుతో ఢీకొట్టిన దుండగులు..



### చికిత్స పొందుతూ మృతి

**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** మాసబ్‌ట్యాంక్ పరిధిలో దారుణం జరిగింది. న్యాయవాదిని దుండగులు కారుతో ఢీకొట్టి హతమార్చిన ఘటన కలకలం రేపింది. శనివారం ఉదయం న్యాయవాది కాజా మొయినుద్దీన్ తన ఇంటి నుంచి బయటకు వచ్చి కారులో బయల్దేరుతున్న క్రమంలో.. వెనుక నుంచి వచ్చి మరో కారుతో ఢీకొట్టారు. దీంతో మొయినుద్దీన్‌కు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే స్థానికులు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మొయినుద్దీన్ మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. ఘటన అనంతరం నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు. దుండగులు కారుతో ఢీకొట్టిన దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డయ్యాయి. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం : ఇద్దరి మృతి



**అనకాపల్లి, విశ్వం వాయిస్ న్యూస్ :** అనకాపల్లి జిల్లా ఉగ్గినపాలెం వద్ద జాతీయ రహదారిపై శనివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. మునగపాక మండలం అరబుపాలెం, మూలపేట గ్రామానికి చెందిన బంధువులు కారులో భద్రాచలం వెళ్లారు. తిరుగు ప్రయాణంలో ఉగ్గినపాలెం వద్ద జాతీయ రహదారిపై పార్కింగ్ చేసిన ఉన్న లారీని బాధితులు ప్రయాణిస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న ఆడారి కూర్మారావు(42), జ్యోతి (31) అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాదంలో ఆరుగురు గాయపడగా చికిత్స నిమిత్తం ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలించారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది.

## మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రంలో అగ్ని ప్రమాదం

### చిక్కుకున్న కార్మికులు

**ముంచంగిపుట్టు, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్, ఒడిశా ప్రభుత్వాలు ఉమ్మడిగా నిర్వహిస్తున్న మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రంలో అగ్ని ప్రమాదం సంభవించింది. పవర్‌స్టేషన్ షట్‌డౌన్ అయిన వెంటనే మంటలు చెలరేగాయి. దీంతో పవర్‌స్టేషన్ రెండో అంతస్తులో పనిచేస్తోన్న కార్మికులు చిక్కుకున్నారు. దట్టమైన పొగ అలముకోవడంతో సహాయకచర్యలకు ఆటంకమేర్పడింది. కొండల మధ్యలో జల విద్యుత్ కేంద్రం ఉండటం వల్ల అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకునేందుకు సమయం పట్టింది. అనంతరం కార్మికులను సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు.

### కంబోడియాలో రాటుతేలారు..

## చీరాల పోలీసులకు చిక్కారు

### డిజిటల్ అరెస్ట్ పేరుతో మోసం కేసులో ముగ్గురి అరెస్టు

**చీరాల, విశ్వం వాయిస్ న్యూస్ :** ఉద్యోగాల కోసం కంబోడియా వెళ్లారు. అక్కడ సైబర్ నేరాలు చేసేవారితో కలిసి వాటిలో శిక్షణ పొందారు. తిరిగి స్వస్థలానికి వచ్చి డిజిటల్ అరెస్ట్ పేరుతో ఓ విశ్రాంత ఉద్యోగస్థుణ్ని మోసం చేసి, రూ.లక్షలు దోచుకున్న కేసులో పోలీసులకు చిక్కారు. బాపట్ల జిల్లా చీరాలలో డీఎస్పీ ఎండీ మొయిన్ శుక్రవారం వివరాలు వెల్లడించారు. ఈ ఏడాది మార్చిలో చీరాల పరిధి కొత్తపేట గ్రామానికి చెందిన విశ్రాంత ఉద్యోగి మోహనరావుకు కొందరు వాట్సప్ కాల్ చేసి, తాము పోలీసులమని చెప్పారు. మీపై మనీ లాండరింగ్ కేసు ఉందని, దాన్నుంచి బయటపడాలంటే డబ్బు పంపాలని ఒత్తిడి చేయడంతో రూ.26 లక్షలు పంపారు. తరువాత తాను మోసపోయానని తెలుసుకున్న బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. విశాఖలోని మూడు బ్యాంకుల నుంచి ఆ నగదు ఇతరుల ఖాతాలకు మళ్లినట్లు పోలీసులు గుర్తించారు. ఈ కేసులో ఏ1 బొందలపు గోవిందు, ఏ2 నాగప్రదీప్, ఏ3 నీల్‌కుమార్‌లను విశాఖపట్నంలో అరెస్టు చేశారు. నిందితుల నుంచి రూ.10 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. వీరిలో నాగప్రదీప్, నీల్‌కుమార్‌లు గతంలో ఉద్యోగాల కోసం కంబోడియా వెళ్లారు. ఆ సమయంలో సైబర్ మోసాలకు పాల్పడే ముఠాతో పరిచయం ఏర్పడి, వాటిని నేర్చుకున్నారు. అక్కడి ముఠాపై పోలీసులు దాడి చేయడంతో.. వీరిద్దరూ వైజాగ్ వచ్చి, ఈ నేరానికి పాల్పడ్డారు. ఈ కేసులో మరికొంతమందిని అరెస్టు చేయాల్సి ఉందని డీఎస్పీ వివరించారు.

### బిల్లు దస్త్రాలు పంపడానికి

## రూ.25 వేలు డిమాండ్

### అనిశాకు చిక్కిన విద్యుత్తు ఏడీఈ

### నగదుతో పట్టుబడిన ఏడీఈ ముద్దం రమణారెడ్డి



**నర్సాపూర్, విశ్వం వాయిస్ న్యూస్ :** మెదక్ జిల్లా నర్సాపూర్‌లో విద్యుత్తు కాంట్రాక్టర్ నుంచి అసిస్టెంట్ డివిజినల్ ఇంజినీర్ (ఏడీఈ) రూ.25వేలు లంచం తీసుకుంటుండగా అవినీతి నిరోధక శాఖ(అనిశా) అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనిశా డీఎస్పీ సుదర్శన్ తెలిపిన వివరాల ప్రకారం.. విద్యుత్తు శాఖలో 2023 నుంచి 2025 మధ్యకాలంలో 11 పనులు పూర్తిచేసిన ఓ కాంట్రాక్టర్‌కు రూ.3,13,882 బిల్లు రావాల్సి ఉంది. ఈ దస్త్రాన్ని ఉన్నతాధికారులకు పంపించేందుకు ఏడీఈ ముద్దం రమణారెడ్డి.. కాంట్రాక్టర్‌ను రూ.30 వేలు అడగ్గా, రూ.25 వేలకు ఒప్పందం కుదిరింది. దీంతో కాంట్రాక్టర్.. అనిశా అధికారులను ఆశ్రయించారు. శుక్రవారం నర్సాపూర్‌లోని ఏడీఈ కార్యాలయంలో రమణారెడ్డి నగదు తీసుకుంటుండగా అధికారులు పట్టుకున్నారు. సొమ్మును స్వాధీనం చేసుకున్నారు. అనిశా ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, రమేశ్ తదితరులు ఉన్నారు.

## బీఆర్ఎస్ నేత చింతలపాటి మధు దారుణ హత్య



**సూర్యాపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** సూర్యాపేట మండలం ఎర్కారంలో మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ చింతలపాటి మధు దారుణ హత్యకు గురయ్యారు. మూడు ముక్కలుగా నరికి మూడు గోనెసంచుల్లో కట్టి గ్రామ సమీపంలోని ఎస్సారెస్పీ కాలువలో పడేశారు. కొన్నేళ్ల క్రితం అప్పటి సర్పంచి మిద్దె రవీందర్ హత్య కేసులో చింతలపాటి మధు ప్రధాన నిందితుడిగా ఉన్నారు. పాత కక్షల నేపథ్యంలోనే హత్య జరిగి ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. దీంతో గ్రామంలో ఉద్రిక్తత నెలకొంది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## యూపీలో బస్సు ప్రమాదం.. పల్నాడు వాసి మృతి



**నరసరావుపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** అయోధ్య, నేపాల్‌కు తీర్థయాత్రకు వెళ్లిన పల్నాడు జిల్లా వాసుల బస్సు ఉత్తరప్రదేశ్‌లో రోడ్డు ప్రమాదానికి గురికాగా, ఇద్దరు మృతిచెందారు. పలువురికి గాయాలయ్యాయి. బాధితుల కథనం ప్రకారం.. నరసరావుపేట, చిలకలూరిపేటకు చెందిన 61 మంది ఈ నెల 20న హైదరాబాద్ వెళ్లి అక్కడ నుంచి విమానంలో 21న ఉదయానికి లఖ్‌నవూ చేరుకున్నారు. అక్కడ ఓ బస్సు బాడుగకు మాట్లాడుకొని నైమిశారణ్యం చేరుకున్నారు. అక్కడ ఆలయాల దర్శనం ముగించుకుని అయోధ్యకు బయలుదేరారు. బస్సు బయలుదేరిన పది నిమిషాల్లో ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని తప్పించబోయి బోల్తాపడింది. ఈ ఘటనలో నరసరావుపేటకు చెందిన టూర్ ఆపరేటర్ శివనాగేశ్వరరావు (41), యూపీకి చెందిన బస్సు డ్రైవర్ మృతి చెందారు. మృతుడు శివనాగేశ్వరరావు నరసరావుపేట బాపనయ్య నగర్‌లో ఉంటూ ఈవెంట్ మేనేజర్‌గా చేస్తున్నారు. ఈ ప్రమాదంలో పలువురికి గాయాలు కాగా.. వారిని స్థానిక ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ఇందులో పలువురు ప్రభుత్వ ఉపాధ్యాయులున్నారు. నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు సహకారంతో గాయపడ్డ వారిని నరసరావుపేటకు తరలించే ఏర్పాట్లు చేస్తున్నారు.

# వనిత వాయిస్

## వైఫల్యాల్ని అధిగమించి.. కెరీర్లో రాణించాలంటే..

వృత్తిఉద్యోగాల్లో మనం ఎన్నో లక్ష్యాలు పెట్టుకుంటాం.. వాటిలో కొన్ని సఫలమవ్వచ్చు.. మరికొన్ని విఫలమవ్వచ్చు. అయితే చాలామంది ఇలాంటి వైఫల్యాల గురించే ఆలోచిస్తూ ఇక తాము కెరీర్‌లో రాణించలేమనుకుంటారు. ఇతరులతో పోల్చుకుంటూ తీవ్ర ఒత్తిడిలోకి కూరుకుపోతుంటారు. నిజానికి ఇలాంటి ప్రతికూల భావాలే కెరీర్ తిరోగమనానికి కారణమవుతాయంటున్నారు నిపుణులు. అందుకే వైఫల్యాల్ని కూడా సానుకూలంగా స్వీకరించి.. వాటి నుంచి కొత్త పాఠాలు నేర్చుకోగలిగితే కెరీర్‌ను తిరిగి గాడిలో పెట్టుకోవచ్చంటున్నారు. మరి, కెరీర్‌లో విఫలమయ్యామని ఎప్పుడనిపిస్తుంది? దానిని అధిగమించి ముందుకు సాగడమెలాగో తెలుసుకుందాం రండి..

### ఇవే కారణమా?

- ఏ పని చేయాలన్నా ప్రణాళిక ముఖ్యం. కెరీర్‌లో విజయవంతంగా ముందుకెళ్లాలన్నా ప్లానింగ్ తప్పనిసరి! అయితే కొంతమంది దీన్ని విస్మరిస్తుంటారు. ఎలాంటి ప్రణాళిక లేకుండా చేతికొచ్చిన పనిని చేసుకుంటూ ముందుకు సాగుతుంటారు. దీనివల్ల ఎంత పనిచేసినా సంతృప్తి కలగదు.. సరికదా కెరీర్‌లో ఆశించిన స్థాయిలో వృద్ధి లేక ఒకానొక సమయంలో విఫలమయ్యామన్న వైరాగ్య భావన ఆవహిస్తుంది.
- కొంతమంది కెరీర్‌లో అయినా, జీవితంలోనైనా సాధ్యం కాని లక్ష్యాల్ని నిర్దేశించుకుంటారు. వాటిని చేరుకునే క్రమంలో ఎంతో శ్రమ పడతారు.. కానీ ఆశించిన ఫలితం దక్కదు. ఇలాంటప్పుడు ఆత్మవిశ్వాసం సన్నగిల్లుతుంది. ఇది క్రమంగా విఫలమయ్యామన్న భావన కలిగేలా చేస్తుంది.
- చదువుకు తగ్గ ఉద్యోగం దొరక్క.. తాత్కాలికంగా ఏదో ఒక ఉద్యోగంలో చేరుతుంటారు కొందరు. ఇటు ఈ ఉద్యోగం చేస్తూనే.. తాము కోరుకున్న కెరీర్‌పై దృష్టి పెడుతుంటారు. ఒకవేళ ఆశించిన ఉద్యోగం లభించకపోతే ఒక రకమైన అసహనానికి, కెరీర్ విఫలమైందన్న భావనకూ లోనవుతుంటారు.
- ఉద్యోగంలో ఎవరి సామర్థ్యాలు వారివి! ఒకరికి అప్పగించిన పనిని వేగంగా పూర్తి చేయగలిగే సామర్థ్యముండచ్చు.. మరొకరికి ఎన్ని పనులైనా ఒంటి చేత్తో నిర్వహించే సత్తా ఉండచ్చు.. ఇంకొకరికి టెక్నాలజీపై పట్టుండచ్చు.. అయినా కొంతమంది తమ సామర్థ్యాల్ని పక్కన పెట్టి ఇతరులతో పోల్చుకుంటుంటారు. ఇది కూడా తాము కెరీర్‌లో విఫలమయ్యామన్న భావనను కలిగిస్తుందంటున్నారు నిపుణులు.
- కెరీర్‌ని విజయవంతంగా కొనసాగించాలంటే ఆరోగ్యం కూడా అందుకు సహకరించాలి. అయితే కొంతమందిలో పలు శారీరక సమస్యలుండచ్చు.. మరికొంతమందికి వ్యక్తిగత/వృత్తిపరమైన కారణాల వల్ల మానసిక సమస్యలు



ఎదురుకావచ్చు. ఇలాంటి సమయంలో చేసే పనిపై పూర్తి దృష్టి పెట్టలేం. దాంతో అటు కెరీర్‌లో వృద్ధి, ఇటు వ్యక్తిగత జీవితంలో సంతృప్తి లేవన్న భావన వెంటాడుతుంది.

- కొంతమంది కెరీర్‌లో పూర్తి చేయాల్సిన లక్ష్యాల్ని పకడ్బందీగా నిర్దేశించుకుంటారు. కానీ వాటిని ఆచరణలో పెట్టే విషయంలో జాప్యం చేస్తుంటారు. పనుల్ని పూర్తిచేసే విషయంలోనూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంటారు. దీనివల్ల కూడా లక్ష్యాల్ని సరైన సమయంలో చేరుకోలేక.. విఫలమయ్యామన్న భావన దరిచేరుతుందంటున్నారు నిపుణులు.
- వృత్తిఉద్యోగాల్లో మనం ఎంత చురుగ్గా వ్యవహరించినా.. మన చుట్టూ ఉన్న కొందరు మనల్ని వెనక్కి లాగాలని చూస్తుంటారు. విమర్శలు, నెగెటివ్ మాటలతో మనలో ప్రతికూల భావనలు కలిగేలా చేస్తారు. ఇలాంటి వ్యక్తులకు ప్రభావితమైనా కెరీర్‌లో ఏమీ సాధించలేకపోతున్నామన్న భావన కలగడం సహజం.
- కొంతమంది విషయంలో కెరీర్ ప్రణాళిక అంతా బాగానే ఉంటుంది.. కానీ ఆయా పనులు పూర్తిచేయడానికి సంబంధించిన ఉత్సాహం కొరవడుతుంది. దీనివల్ల కూడా పనులు అనుకున్న సమయానికి పూర్తికాక.. కెరీర్ విఫలమైందన్న ఒక రకమైన అసహనం దరిచేరుతుంది.

### అధిగమిస్తేనే అందలం!

- జీవితంలోనైనా, కెరీర్ పరంగానైనా.. తమకెదురైన వైఫల్యాల్ని చాలామంది స్వీకరించరు. తమకే ఎందుకిలా? అన్న ప్రతికూల భావనలోకి కూరుకుపోతారు. కానీ ఇలా ఆలోచించడం కంటే.. 'జరిగిందేదో జరిగిపోయింది.. మరోసారి ఇలా జరగకుండా జాగ్రత్తపడాల'న్న సానుకూల దృక్పథంతో ముందుకు సాగినప్పుడే.. కెరీర్ వృద్ధి సాధ్యమవుతుందంటున్నారు నిపుణులు.
- 'ఓటమి గెలుపుకి తొలి మెట్టు' అంటారు. అంటే.. ఓటమికి గల కారణాల్ని పసిగట్టి.. వాటి నుంచి పాఠాలు నేర్చుకుంటూనే.. అలాంటి పొరపాట్లు పునరావృతం కాకుండా జాగ్రత్తపడినప్పుడే కెరీర్ వైఫల్యాల్ని సులభంగా అధిగమించచ్చంటున్నారు నిపుణులు.
- 'నా పనేదో నాది.. ఇతరులతో సంబంధం లేదన్న'ట్లుగా పని ప్రదేశంలో కొంతమంది రిజర్వ్‌డ్‌గా వ్యవహరిస్తుంటారు. కెరీర్‌లో వెనకబడినప్పుడు ఇలాంటి వారికి తోటి వారి నుంచి ఎలాంటి సహాయం అందదు. కాబట్టి వృత్తిఉద్యోగాల్లో తోటి ఉద్యోగులతో సత్సంబంధాలు ఏర్పరచుకోవడం, ఇతర సంస్థల్లో పనిచేసే స్నేహితులతో స్నేహబంధం కొనసాగించడం వల్ల.. కెరీర్‌లో ఎదురయ్యే సమస్యల్ని అధిగమించడం సులభమవుతుందంటున్నారు నిపుణులు.
- ప్రస్తుతం ఉన్నత స్థాయిలో ఉన్న ఎంతోమంది తమ కెరీర్ మొదట్లో వైఫల్యాలను ఎదుర్కొన్న వారే! కాబట్టి వాళ్ల స్ఫూర్తి గాథల గురించి తెలుసుకుంటే ప్రోత్సాహకరంగా ఉంటుంది. వృత్తి ఉద్యోగాల్లో ప్రతికూలతల్ని ఎలా అధిగమించాలో కూడా వాళ్ల నుంచి నేర్చుకోవచ్చు.
- వైఫల్యాలు ఎదురయ్యాయని వాటినే తలచుకుంటే అక్కడే ఆగిపోతాం. అదే ఆ ప్రతికూల ఆలోచనల్ని అధిగమించి.. ఆసక్తి ఉన్న అంశాలపై దృష్టి పెడితే.. కొత్త విషయాలు నేర్చుకోగలుగుతాం.. ఇదీ పరోక్షంగా మన కెరీర్‌కి ప్లస్ అవుతుంది.
- ఎంత నేర్చుకున్నా, ఎన్ని నైపుణ్యాల్లో పట్టు సాధించినా నిత్య విద్యార్థిగా ఉన్నప్పుడే మన కెరీర్ అవకాశాల్ని విస్తరించుకోగలుగుతాం. అందుకే వైఫల్యాల్ని పక్కన పెట్టి మీ చదువుకు తగ్గ ఇతర కెరీర్ అవకాశాలపై దృష్టి పెట్టమంటున్నారు నిపుణులు. దీనివల్ల ఇటు కెరీర్ అభివృద్ధి సాధించచ్చు.. అటు ఆర్థికంగానూ మరింత దృఢం కావచ్చు.

# విశ్వం వాయిస్
అవినీతిపై- అక్షరసమరం...



కాకినాడ తూర్పు గోదావరి
డా బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ

ఆదివారం, 24 మే, 2026


www.viswamvoice.com

# ఎంఆర్ఐ, లీనియర్ యాక్సిలరేటర్ల తక్కువ రోజుల్లోనే చికిత్స

**క్యాన్సర్ కణాలపై కచ్చితమైన దాడి.. రేడియేషన్ వైద్యంలో సరికొత్త శకం! - ఆరోగ్యకరమైన అవయవాలకు హాని లేకుండా సురక్షితమైన వైద్యం**

**యశోద వైద్యశాల ఆధ్వర్యంలో విజయవంతంగా సేవలందిస్తున్న అధునాతన సాంకేతికత**

**రాజమహేంద్రవరం, నేటి వార్త :** క్యాన్సర్ రోగుల పాలిట వరంగా రేడియేషన్ వైద్య విధానంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయి. దుష్ప్రభావాలకు తావులేకుండా కేవలం కణితిని మాత్రమే లక్ష్యంగా చేసుకుని నాశనం చేసే 'ఎంఆర్ లీనాక్' సాంకేతికతను హైటెక్ సిటీ యశోద వైద్యశాల వైద్యులు పరిచయం చేశారు. రాజమండ్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో క్యాన్సర్ వైద్య నిపుణుడు దేవ్ నారాయణ దత్త ఈ అధునాతన చికిత్స వివరాలను వెల్లడించారు. ప్రపంచంలోనే అత్యంత ఆధునికమైన ఈ యంత్రంలో ఎంఆర్ఐ స్కాన్, లీనియర్ యాక్సిలరేటర్ వ్యవస్థలు ఏకకాలంలో పనిచేస్తాయి. ప్రతిరోజూ చికిత్సకు ముందు రోగికి



స్వయంచాలకంగా ఎంఆర్ఐ స్కాన్ జరిగి, కణితి పరిమాణం, ఆకారం, స్థానాన్ని కచ్చితంగా గుర్తిస్తుంది. ఈ అధునాతన సమాచారం ఆధారంగా రేడియేషన్ కిరణాలు వ్యాధి సోకిన భాగాన్ని మాత్రమే తాకుతాయి. తద్వారా చుట్టుపక్కల ఉండే ఆరోగ్యకరమైన అవయవాలకు ఎలాంటి ప్రమాదం వాటిల్లదు. సాధారణ రేడియేషన్ వల్ల వచ్చే తలనొప్పి, వాంతులు, మూత్రంలో రక్తం పడటం, తీవ్రమైన నీరసం, చర్మ సమస్యల వంటివి ఇందులో పూర్తిగా నివారించబడతాయి. ముఖ్యంగా మెదడు కణితులు, ప్రోస్టేట్, రెక్టల్, గర్భాశయ, సర్విక్స్, మూత్రాశయ, ప్యాంక్రియాస్, ఊపిరితిత్తుల క్యాన్సర్ల నివారణలో ఇది అత్యుత్తమ ఫలితాలను ఇస్తోంది. రోజువారీగా శరీరంలో వచ్చే మార్పులను పసిగడుతూ ఎప్పటికప్పుడు చికిత్సను దానంతట అదే మార్చుకునే సామర్థ్యం ఈ యంత్రానికి ఉంది. రోగులు నెలల తరబడి ఆసుపత్రుల చుట్టూ తిరిగే బాధను తప్పిస్తూ కొన్నిసార్లు కేవలం ఐదు రోజుల్లోనే పూర్తి చికిత్సను అందించడం దీని ప్రత్యేకత. దీనివల్ల బాధితులు శారీరక, మానసిక ఒత్తిడికి గురికాకుండా త్వరగా కోలుకుంటారు. అత్యంత అరుదైన ఈ సాంకేతికతను దేశంలోనే తొలిసారిగా రెండేళ్ల క్రితమే యశోద వైద్యశాల ప్రవేశపెట్టి దేశ విదేశీ రోగులకు పునర్జన్మ ప్రసాదిస్తూ అత్యుత్తమ విజయాలను నమోదు చేస్తోంది. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి ప్రతినిధులు వినోద్, ఎస్.వి. రామకృష్ణ, వి.సాయికిరణ్ పాల్గొన్నారు.

పది పాసైన విద్యార్థులకు

# పూర్వ విద్యార్థుల ప్రోత్సాహం

**డిఎంహెచ్ స్కూల్లో 18 మంది విద్యార్థులకు నగదు సహాయం**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాలలో ప్రస్తుతం పదవ తరగతి పాస్ అయిన విద్యార్థులకు ఆ పాఠశాల పూర్వ విద్యార్థులు నగదు సహాయం చేసి వారిని ప్రోత్సహించారు. వివరాల్లోకి వెళితే దానవాయిపేట మున్సిపల్ హైస్కూల్లో 1984-85 బ్యాచ్ కి చెందిన పూర్వ విద్యార్థులు సమాలోచనచేసి 2025-26 10వ తరగతిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ఆర్థిక సహాయం అందజేశారు. పూర్వ విద్యార్థుల సంఘంలో ఇటీవలే మహేష్ అనే వ్యక్తి మరణించారు.ఆయన జ్ఞాపకార్థం పూర్వ విద్యార్థులు అందరూ కలిసి పదవ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి 548 మార్కులు సాధించిన విద్యార్థికి రూ 4000, 530 మార్కులు సాధించిన విద్యార్థికి రూ.3000, 510 మార్కులు సాధించిన విద్యార్థికి రూ.2000, పాసైన ప్రతి ఒక్కరికి రూ 500 చొప్పున ఆర్థిక సహాయాన్ని శనివారం అందజేశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు కొమ్ము పాపారావు మాట్లాడుతూ చదువుకున్న పాఠశాలకు ఏదో ఒకటి చేయాలన్న తపన పూర్వ విద్యార్థులుగా తమలో ఉందని గతంలో సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేశామన్నారు. ఈ ఏడాది తమ మిత్రుడి జ్ఞాపకార్థం ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఎండి గౌస్ మోహిద్దీన్, ఎన్.వెంకన్న, జి.అన్నవరం, దయానిధి, ఎండి.అహ్మద్ వల్లి, ఎం గోవింద్, పి.సూర్యనారాయణ, ముత్తిన శ్రీను, కే.రాంబాబు, సుజాత, మేడపురెడ్డి వెంకటేశ్వరరావు, ఇబ్రహీం,మావూరి శ్రీనివాస్, అహ్మద్ జామా,మోహన్ హరి, ఏ శివప్రసాద్, ఏ.పార్థసారథి, ఎస్ కే జాఫర్ వల్లి తదితరులు పాల్గొన్నారు.

# మన పరిసరాలు శుభ్రంగా ఉంచాలి.. ఇది మన అందరి బాధ్యత

**- 14వ వార్డులో ఆపరేషన్ క్లీన్ స్వీప్‌లో వార్డు ఇంచార్జ్ ఈతలపాటి రవి**

**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** రాజమహేంద్రవరం అర్బన్ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ఆదేశాల మేరకు శనివారం ఉదయం స్థానిక 14వ వార్డు ఇంచార్జి తెలుగుదేశం పార్టీ నాయకులు ఈతలపాటి రవి ఆధ్వర్యంలో 'ఆపరేషన్ క్లీన్ స్వీప్' కార్యక్రమాన్ని సచివాలయం సిబ్బంది తో నిర్వహించారు.ఆపరేషన్ క్లీన్ స్వీప్‌లో నెలరోజుల పారిశుధ్యం అమలులో భాగంగా పారిశుధ్య కార్మికులతో ప్రధాన రాహదారులు చీపుర్లు పట్టి శుభ్రపరిచారు. రవి మాట్లాడుతూ పరిసరాలు శుభ్రంగా ఉండాలి ఇది మన అందరి బాధ్యత,నగరంలోని నూరు శాతం క్లీన్ సిటీ రాజమండ్రిగా చేయడానికి నగర ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు నగరాన్ని ఎంతో అభివృద్ధి చేస్తూ ఉన్నారు. ప్రజలు పారిశుధ్య కార్మికులతో సహకరించాలని, ప్రతి ఒక్కరూ మీ పరిసర ప్రాంతాల్లో పరిసరాలు శుభ్రంగా ఉంచడం వలన రోగాలు,దోమల బారిన పడకుండా ఆరోగ్యకరమైన వాతావరణంలో ఉండవచ్చు అని అన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వార్డ్ టిడిపి సీనియర్ నాయకులు ఉడమల



నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

# వార్డు విభజన అభ్యంతరాలకు ముగిసిన గడువు

**పురపాలక సంఘం పునర్విభజనకు ఐదు అభ్యంతరాలు**




**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** మండపేట పుర పాలక సంఘం పునర్ విభజనకు సంబంధించిన అభ్యంతరాల సమయం శనివారం ముగిసింది. కేవలం ఐదు అభ్యంతరాలు మాత్రమే వచ్చాయి. మండపేట పోలీస్ స్టేషన్ ఎదురుగా మంగలి బోదె వెంబడి ఉన్న1-3-2 నుండి 1-3-8వరకు ఉన్న ఇళ్లు ఆరో వార్డులో చేర్చాలని ఎం.బాలాజీ విజ్ఞప్తి చేశారు. 11 వ వార్డు లో కొన్ని డోర్ నంబర్ లు తొలగించాలని వేరే వార్డు కు వెళ్లిన కొన్ని డోర్ నంబర్ ఇళ్ళు కొత్త 11 వ వార్డు లో చేర్చాలని కొవ్వాడ అప్పన్న బాబు, ఆళ్ల వీర బాబు, జె సురేష్,వి నాగేశ్వరావు లు కోరారు.దీనికి సంబంధించిన డోర్ నంబర్ లు ఉదహరిస్తూ అభ్యంతరాలను కమీషనర్ కు లిఖిత పూర్వకంగా అందజేశారు. కొత్త రెండవ వార్డు లో వీరభద్రపురంలోని 4 వీధులు కలిపారని వాటిని తొలగించాలని చిట్టూరి గణేష్ అభ్యంతరం వ్యక్తం చేశారు. గొల్లల గుంట, సత్య చంద్ర అపార్ట్మెంట్ వీధి ఇరువైపుల రెండ వ వార్డు లో చేర్చాలని విజ్ఞప్తి చేశారు. కొత్త గా ఏర్పడిన సైదల్లి పేట 30 వ వార్డు లో కంచి కామాక్షి ఆలయం వద్ద డోర్ నెంబర్ లు, గౌరీ శంకర్ టైప్ ఇనిస్ట్యూట్ వీధి లోని డోర్ నంబర్ లు 30 వ వార్డు లో కలపాలని జొన్నపల్లి సూర్యారావు చింతల శ్రీనివాస్ కాళ్ళ ఆనంద్ బొడ్డు రామకృష్ణ పొడగట్లపల్లి వెంకట్రావు వెంకటరమణ సూరాల శ్రీనివాస్ కడప శ్రీనివాస్ కోడి రాము గోమాగ శ్రీనివాస్ బొడ్డపాటి మంగరాజులు కోరారు. పటేల్ స్కూల్,రామచంద్రుడు కాల్వ గట్టు, రైతు బజార్, చాపల బజార్ లను వేరే వార్డు లో విలీనం చేయాలని లిఖిత పూర్వకంగా వినతి పత్రాలు అందజేశారు. ఇక వీరభద్రపురం, మెహర్ నగర్ కలిపి వార్డు గా ఏర్పాటు చేయాలని టిడిపి అధ్యక్షులు మచ్చా నాగు , టిడిపి నాయకులు ఉంగరాల రాంబాబు, టేకి వెంకటేష్ లు వినతి పత్రాలు అందజేశారు. ఈ ఐదు అభ్యంతరాలు వచ్చాయని, వీటిని ప్రభుత్వానికి నివేదిస్తామని టౌన్ ప్లానింగ్ అధికారి రమ్యశ్రీ తెలిపారు.

అభివృద్ధితోపాటు ప్రజల ఆరోగ్యానికి

# కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత

**భవిష్యత్ తరాలకు పరిశుభ్రమైన ఆంధ్రప్రదేశ్‌ను అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత**

**ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమంలో రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు**







**రాజమహేంద్రవరం, నేటి వార్త :** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆలోచనల మేరకు, రాష్ట్రాన్ని పరిశుభ్రమైన ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "ఆపరేషన్ క్లీన్ స్వీప్" కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు ఈరోజు ఉదయం రాజమహేంద్రవరం నగరంలోని స్థానిక మూడవ వార్డులో రహదారులు, డ్రెయిన్లు మరియు పరిసర ప్రాంతాల్లో సచివాలయ సిబ్బంది మరియు మున్సిపల్ సిబ్బందితో కలిసి స్వచ్ఛత కార్యక్రమాల్లో పాల్గొని పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. అభివృద్ధి కార్యక్రమాలతో పాటు ప్రజల ఆరోగ్య పరిరక్షణకు కూడా కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. పరిశుభ్రమైన పరిసరాలు ఉంటేనే ప్రజలు ఆరోగ్యంగా జీవించగలరని, వ్యాధుల వ్యాప్తిని నివారించవచ్చని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రవ్యాప్తంగా పట్టణాలు, గ్రామాలు పరిశుభ్రంగా ఉండేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేస్తున్నారని తెలిపారు. మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ ఆధ్వర్యంలో పట్టణ ప్రాంతాల్లో పరిశుభ్రత, పారిశుధ్య నిర్వహణ మరింత సమర్థవంతంగా కొనసాగుతోందని అన్నారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో ఉప ముఖ్యమంత్రి మరియు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రికొణిదల పవన్ కళ్యాణ్ నాయకత్వంలో గ్రామాల పరిశుభ్రత, మౌలిక వసతుల అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని పేర్కొన్నారు. "శుభ్రమైన రోడ్లు - శుభ్రమైన డ్రెయిన్లు - పరిశుభ్రమైన పరిసరాలు" అనే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలకు ప్రజలు సంపూర్ణ సహకారం అందించాలని ఆయన కోరారు. ప్రతి ఒక్కరూ తమ ఇల్లు, వీధి, ప్రాంతం పరిశుభ్రతపై శ్రద్ధ చూపితే ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ప్రతి ఇంటి వద్ద చెత్తను వేరు చేయడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం వంటి అలవాట్లు అలవరుచుకోవాలని సూచించారు. భవిష్యత్ తరాలకు పరిశుభ్రమైన ఆంధ్రప్రదేశ్‌ను అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన గుర్తు చేశారు.

యూపీలో నరసరావుపేట ప్రయాణికుల

# బస్సుకు ప్రమాదం

**ఇద్దరి మృతి**

**నరసరావుపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** ఉత్తర్ ప్రదేశ్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆంధ్రప్రదేశ్ కు చెందిన ఇద్దరు మృతి చెందారు. నైమిశారణ్యం నుంచి అయోధ్య వెళుతుండగా బస్సు ప్రమాదానికి గురైంది. ఆ సమయంలో బస్సులో నరసరావుపేట, చిలకలూరిపేటకు చెందిన 50 మంది ప్రయాణికులు ఉన్నారు. ప్రమాదంలో డ్రైవర్, పర్యాటక గైడ్ మృతి చెందగా, పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. లక్నో, అయోధ్య మీదుగా నేపాల్ వెళ్తుండగా ప్రమాదం జరిగిందని బాధితులు తెలిపారు.

దేవరపల్లిలో ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌కు

# ఈ నెల 25న శంకుస్థాపన

వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేయనున్న సీఎం చంద్రబాబు
రూ.15కోట్లతో 3.30 ఎకరాల్లో ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ క్యాంపెక్స్ ఏర్పాటు
ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే బండారు



**రావులపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ :** సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమల ఏర్పాటు ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు కూటమి ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. రాష్ట్రంలో 175 పారిశ్రామిక పార్కుల అభివృద్ధి పథకంలో ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక ఎమ్.ఎస్.ఎమ్.ఈ పార్క్ ప్రారంభించేందుకు చేపట్టిన చొరవలో భాగంగా రావులపాలెం మండలం దేవరపల్లిలో రూ.15 కోట్లతో 3.30 ఎకరాల భూమిలో ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ క్యాంపెక్స్ అభివృద్ధి చేయనున్నారు. ఈ నెల 25వ తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వర్చువల్ విధానంలో ఈ కాంప్లెక్స్‌కు శంకుస్థాపన చేయనున్నారు. కొత్తపేట నియోజకవర్గంలో దేవరపల్లి గ్రామంలో రూ.15 కోట్లతో ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ క్యాంపెక్స్ ఏర్పాటు చేస్తున్నందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కి కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

రంగాపురంలో కరికాల భక్త కళ్యాణ మండప

# నిర్మాణ పనులు ప్రారంభం

కొబ్బరికాయ కొట్టి పనులకు శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే ఆనందరావు



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** అమలాపురం నియోజకవర్గంలోని సమనస గ్రామం రంగాపురంలో ప్రజల చిరకాల కోరికైన "కరికాల భక్త కళ్యాణ మండప" నిర్మాణ పనులను శనివారం ఉదయం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ప్రారంభించారు. కొబ్బరికాయ కొట్టి పనులకు శ్రీకారం చుట్టిన ఆయన, గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నేతృత్వంలో గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. పేద, మధ్యతరగతి ప్రజలు శుభకార్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, సామాజిక వేడుకలు గౌరవప్రదంగా నిర్వహించుకునేందుకు ఈ కళ్యాణ మండపం ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. గత ప్రభుత్వాల నిర్లక్ష్యంతో నిలిచిపోయిన ప్రజా ఉపయోగకరమైన పనులను కూటమి ప్రభుత్వం తిరిగి ప్రాధాన్యత క్రమంలో చేపడుతోందని ఆయన స్పష్టం చేశారు. కళ్యాణ మండప నిర్మాణాన్ని నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని, సమనస గ్రామం రంగాపురం అభివృద్ధికి తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని ఎమ్మెల్యే ఆనందరావు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక కూటమి నాయకులు, జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు, గ్రామ పెద్దలు, వివిధ శాఖల అధికారులు, రంగాపురం గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రామచంద్రపురంలో ఎస్ఎస్సీ అడ్వాన్స్డ్

# సప్లిమెంటరీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

ఆర్డీఓ ఎ.సరళవతి



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం రెవెన్యూ డివిజన్ పరిధిలో మే 25వ తేదీ నుండి ఎస్ఎస్సీ అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పరీక్షల నిర్వహణకు అన్ని శాఖలతో సమన్వయం చేసుకున్నామని ఆర్డీఓ ఎ. సరళవతి తెలిపారు. పదవ తరగతి రెగ్యులర్ స్ట్రీమ్ పరీక్షలు మే 25 నుండి జూన్ 4 వరకు, అలాగే ఓపెన్ స్కూల్ మరియు ఓపెన్ ఇంటర్మీడియట్ పరీక్షలు మే 25 నుండి జూన్ 1వ తేదీ వరకు ప్రతిరోజూ ఉదయం 9:30 గంటల నుండి మధ్యాహ్నం 12:45 గంటల వరకు జరుగుతాయని పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారతీయ న్యాయ సంహిత సెక్షన్ 163 (పూర్వపు సెక్షన్ 144) అమలులో ఉంటుందని స్పష్టం చేశారు. రామచంద్రపురం మున్సిపల్ హై స్కూల్, పిల్లావారి స్ట్రీట్ నందు ఇంటర్మీడియట్ ఏపీఓఎస్ఎస్ పరీక్షలు, ఎస్‌కెపిజిఎన్ గవర్నమెంట్ హై స్కూల్ నందు పదవ తరగతి ఏపీఓఎస్ఎస్ మరియు రెగ్యులర్ స్ట్రీమ్ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షల నిర్వహణలో భాగంగా మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో శానిటేషన్, తాగునీటి సదుపాయాలు కల్పించామని, ఈపీడీసీఎల్ అధికారులు విద్యుత్ అంతరాయం లేకుండా మరియు సీసీ కెమెరాలు నిరంతరాయంగా పనిచేసేలా చూడాలని ఆదేశించామని వివరించారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని వైద్య శాఖ ద్వారా మెడికల్ స్టాఫ్‌తో పాటు ఫస్ట్ ఎయిడ్ కిట్లు మరియు ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని సూచించారు. విద్యార్థులు సమయానికి పరీక్షా కేంద్రాలకు చేరుకొని ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలని, ఇందుకు తల్లిదండ్రులు, ప్రజలు సహకరించాలని ఆర్డీఓ కోరారు.

# కోనసీమ జిల్లాలో ఐదు రోజులపాటు తీవ్ర ఎండలు

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : 54 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం
జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రానున్న ఐదు రోజుల్లో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లావ్యాప్తంగా 19 మండలాల పరిధిలో సుమారు 41 డిగ్రీల సెంటీగ్రేడ్ నుంచి 54 డిగ్రీల సెంటీగ్రేడ్ వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముందని రియల్ టైమ్ గవర్నెన్స్ ద్వారా వాతావరణ కేంద్రం వెల్లడించిందన్నారు. అందువల్ల రాబోయే ఐదు రోజులు కోనసీమ జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అయితే వర్షపాతం పరంగా రానున్న ఐదు రోజులకు ఎటువంటి ప్రత్యేక హెచ్చరికలు జారీ కాలేదని తెలిపారు. ప్రజలు అత్యవసరమైతే తప్ప మధ్యాహ్న వేళల్లో బయటకు వెళ్లకుండా ఉండాలని, తగినంత నీరు తీసుకోవాలని, వృద్ధులు, చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ప్రజలకు ఎండ వేడిమి నుంచి ఉపశమనం కలిగేలా రద్దీ ప్రాంతాలు, ప్రజలు ఎక్కువగా తిరిగే చోట్ల చల్లని మంచినీరు, మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. వడగాలుల నుంచి ఎలా రక్షించుకోవాలో ప్రజలకు అవగాహన కల్పించాలని క్షేత్రస్థాయి అధికారులకు సూచించారు. సామాజిక మాధ్యమాల ద్వారా నిరంతరం సమాచారాన్ని ప్రజలకు చేరవేయాలన్నారు. ఎండ తీవ్రత నేపథ్యంలో బయటకు వచ్చేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా వృద్ధులు, గర్భిణీలు, చిన్నారులు, అనారోగ్యంతో ఉన్నవారు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు బయటకు రాకుండా ఉండాలని సూచించారు. మరోవైపు ఎండ తీవ్రతతో ఇబ్బందులు పడుతున్న మూగజీవులు, పక్షులకు కూడా నీటి తొట్టెలు, మట్టి కుండల ద్వారా త్రాగునీరు ఏర్పాటు చేయాలని కోరారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఎక్కడా త్రాగునీటి కొరత రాకుండా చూడాలని, నీటి సమస్యలు ఉన్న ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలని ఆదేశించారు. 2015లో బలమైన ఎల్‌నినో ప్రభావంతో 50.1 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైందని గుర్తుచేశారు. ఈ ఏడాదిలో కూడా ఎల్‌నినో ప్రభావంతో ఇప్పటివరకు 48 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని తెలిపారు. గత మూడు రోజులుగా 45 డిగ్రీల నుంచి 48 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు పెరిగినట్లు వెల్లడించారు.

# విద్యార్థుల భద్రతే మా ప్రథమ కర్తవ్యం

జిల్లా ఎస్పీ రాహుల్ మీనా





**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం జిల్లా ఎస్పీ రాహుల్ మీనా ఐపీఎస్ ప్రత్యేకంగా ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలతో విద్యార్థుల భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల రవాణా, పాఠశాల పరిసరాల్లో భద్రతా చర్యలు, డ్రైవర్ల బాధ్యతలు, ట్రాఫిక్ నియంత్రణ వంటి అంశాలపై పలు సూచనలు చేశారు. అన్ని విద్యాసంస్థల రవాణా వాహనాలు సంబంధిత అధికారులచే ధృవీకరించబడిన చెల్లుబాటు అయ్యే ఫిట్‌నెస్ సర్టిఫికేట్లను కలిగి ఉండాలని, రవాణా వాహనాల్లో విద్యార్థులను అధిక సంఖ్యలో ఎక్కించరాదని తెలిపారు. విద్యార్థులను ఎక్కించడం, దించడం సమయంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రతి వాహనంలో సహాయకుడు లేదా అటెండెంట్ ఉండేలా చూడాలని సూచించారు. వాహనాల్లో సరైన ముందు, పక్క అద్దాలు ఏర్పాటు చేసి పిల్లల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, అవసరమైతే తల్లిదండ్రులు లేదా సంరక్షకులు కూడా వాహనాల్లో ప్రయాణించే అవకాశం కల్పించాలని పేర్కొన్నారు. శారీరక విద్య విభాగ సిబ్బంది బాలికలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, విద్యార్థులను తల్లిదండ్రులు లేదా సంరక్షకులకు సక్రమంగా అప్పగించే విధంగా యాజమాన్యాలు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా బ్లాక్ బ్రిడ్జి, రెడ్ బ్రిడ్జి ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీని నివారించేందుకు పాఠశాల బస్సులను వేర్వేరు సమయాల్లో నడపాలని సూచించారు. బస్సుల డ్రైవర్లందరికీ చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలని, నిర్లక్ష్యంగా లేదా అజాగ్రత్తగా వాహనాలు నడపకుండా యాజమాన్యాలు పర్యవేక్షించాలని తెలిపారు. విద్యార్థులు కిటికీల బయటకు చేతులు లేదా తలలు పెట్టకుండా డ్రైవర్లు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. విద్యార్థులు ప్రయాణించే ప్రతి బస్సులో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి తగిన డేటా నిల్వ వ్యవస్థ కల్పించాలని సూచించారు. అలాగే పాఠశాలలు, కళాశాలలు విడిచే సమయాల్లో ఈవ్ టీజింగ్, రేసింగ్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్ వంటి చర్యలకు పాల్పడే అల్లరి మూకలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ, అమలాపురం ఎస్‌డీపీవో, అమలాపురం ఇన్‌స్పెక్టర్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్, సోషల్ మీడియా ఇన్‌స్పెక్టర్‌తో పాటు ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# రాబోయే వారం రోజులు తీవ్ర ఉక్కపోత

ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆర్డీఓ ఎ.సరళవతి సూచన

**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం రెవెన్యూ డివిజన్ పరిధిలో రాబోయే వారం రోజుల పాటు ఉష్ణోగ్రతలు మరియు ఉక్కపోత తీవ్రత అధికంగా నమోదయ్యే అవకాశం ఉన్నందున ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని రెవెన్యూ డివిజనల్ అధికారి ఎ. సరళవతి హెచ్చరించారు. భారత వాతావరణ శాఖ విడుదల చేసిన ప్రత్యేక హీట్‌వేవ్ బులెటిన్ ప్రకారం డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాతో పాటు రాష్ట్రంలోని తీర ప్రాంత జిల్లాల్లో ఉక్కపోత తీవ్రత గణనీయంగా పెరిగే అవకాశం ఉందని ఆమె తెలిపారు. ప్రజల ఆరోగ్య రక్షణ దృష్ట్యా, ఎండ తీవ్రత ఎక్కువగా ఉండే ఉదయం 11.00 గంటల నుండి మధ్యాహ్నం 3.00 గంటల వరకు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని సూచించారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు, గర్భిణీ స్త్రీలు మరియు దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. దాహం వేయకపోయినా తరచూ తగినంత నీరు త్రాగాలని, శరీరంలో లవణాల సమతుల్యత కోసం మజ్జిగ, నిమ్మరసం, కొబ్బరినీళ్లు, ఓఆర్ఎస్ వంటి ద్రవాలను ఎక్కువగా తీసుకోవాలని ఆమె సూచించారు. తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు వెళ్లాల్సి వస్తే గొడుగు, టోపీని ఉపయోగించడం లేదా తడి గుడ్డతో తలను కప్పుకోవడం మంచిదని, అలాగే గాలి ఆడేలా పలుచని లేత రంగు పత్తి దుస్తులు ధరించడం ఉత్తమమని తెలిపారు. కార్మికులు, రైతులు వంటి బహిరంగ ప్రదేశాల్లో పనిచేసే వారు ఎండ తీవ్రత అధికంగా ఉండే సమయాల్లో పనుల వేగాన్ని తగ్గించుకుని, మధ్య మధ్యలో నీడ ప్రాంతాల్లో విశ్రాంతి తీసుకుంటూ పనులు నిర్వహించుకోవాలని కోరారు. ఒకవేళ తీవ్రమైన తలనొప్పి, నీరసం, తల తిరగడం, వాంతులు, స్పృహ తప్పడం వంటి వడదెబ్బ లక్షణాలు కనిపిస్తే ఏమాత్రం ఆలస్యం చేయకుండా సమీప ప్రభుత్వ వైద్యులను సంప్రదించి చికిత్స పొందాలని ఆర్డీఓ స్పష్టం చేశారు. వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రజలందరూ తగిన జాగ్రత్తలు పాటిస్తూ సురక్షితంగా ఉండాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

రోడ్డు పక్కన అపస్మారక స్థితిలో ఉన్న వ్యక్తికి అండగా నిలిచిన

# సత్యం వాసంశెట్టి ఫౌండేషన్, మున్సిపల్ అధికారులు

**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం పట్టణంలో తీవ్ర అనారోగ్యంతో రోడ్డు పక్కన పడి ఉన్న ఓ నిరాశ్రయ వ్యక్తిని సకాలంలో ఆసుపత్రికి తరలించి మానవత్వాన్ని చాటుకున్నారు సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ప్రతినిధులు మరియు మున్సిపల్ అధికారులు. రామచంద్రపురంలోని సూర్య సినిమా మ్యాక్స్ సమీపంలో గత రెండు రోజులుగా ఎండ తీవ్రతకు, ఆరోగ్య సమస్యలతో లేవలేని స్థితిలో పడి ఉన్న బాధితుడిని స్థానికులు గమనించి సమాచారం అందించారు. దీనిపై వెంటనే స్పందించిన ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం, మున్సిపల్ కమిషనర్ కె.వి.ఆర్ రాజుతో కలిసి అక్కడికి చేరుకుని బాధితుడిని పరామర్శించారు. వెంటనే ఏరియా ఆసుపత్రికి తరలించి అక్కడ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రవీణ్ సహకారంతో తక్షణ వైద్యం అందించడం ద్వారా నిండు ప్రాణాన్ని కాపాడారు. విచారణలో ఆ బాధితుడు సామర్లకోట మండలం పెద్ద బ్రహ్మదేవం గ్రామానికి చెందిన యంటపల్లి సుబ్బారావుగా గుర్తించారు. కుటుంబ సభ్యులు వచ్చేవరకు బాధితునికి కావాల్సిన ఆహారం, వస్త్రాలు, వైద్యం వంటి అన్ని సౌకర్యాలను ఫౌండేషన్ తరపున కల్పిస్తామని వాసంశెట్టి



సత్యం హామీ ఇచ్చారు. ఎండలు, ఉక్కపోత తీవ్రంగా ఉన్న తరుణంలో అనాథగా పడి ఉన్న వ్యక్తికి ఆపన్నహస్తం అందించిన ఫౌండేషన్ మరియు అధికారుల సేవాభావాన్ని స్థానికులు, ప్రజలు ఎంతగానో ప్రశంసిస్తున్నారు.

# పుట్టినరోజు కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే



**అంబాజీపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** అంబాజీపేట మండలం తొండవరం గ్రామ మాజీ ఉపసర్పంచ్ దిగుమర్తి చిట్టిబాబు కుమారుడు నిహాన్ తొలి జన్మదిన వేడుకలు శనివారం ఆనందోత్సాహాల మధ్య ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ వేడుకలకు పి.గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు గిడ్డి సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరై చిన్నారి నిహాన్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి సంతోషాన్ని పంచుకున్న ఎమ్మెల్యే , చిన్నారి నిహాన్ భవిష్యత్తులో మంచి ఆరోగ్యం, ఆయురారోగ్యాలతో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్థానిక కూటమి నాయకులు, గ్రామ పెద్దలు, అభిమానులు, కుటుంబ సభ్యులు పాల్గొని వేడుకలను మరింత ఆనందంగా మార్చారు.

# రోడ్డు వేసుకున్న అడ్డపుంత గ్రామస్తులు



**కాట్రేనికోన, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమజిల్లా, కాట్రేనికోన మండలం దొంతుకుర్రు గ్రామం పరిధిలో వింత సంఘటన జరిగింది. సాధారణంగా అధికారుల పర్యవేక్షణలో కాంట్రాక్టర్లు రోడ్లు నిర్మిస్తుంటారు. ఇందుకు భిన్నంగా దొంతికుర్రు పంచాయతీ పరిధిలోని అడ్డపుంతకు చెందిన గ్రామస్తులు అంతా ఏకమై గ్రావెల్ రోడ్డును నిర్మించుకున్న సంఘటన శనివారం చోటుచేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలుఈ విధంగా ఉన్నాయి. ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు ఇటీవల ఈ ప్రాంతంలో గ్రావెల్ రోడ్డు నిర్మించేందుకు శంకుస్థాపన చేశారు. గెద్దనపల్లి,పోరాపేట విద్యార్థులు పలువురు ఈ మార్గం గుండా దొంతుకుర్రు హై స్కూల్‌కు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ ప్రాంతంలో పండిన కొబ్బరి, వరి పంటలను ఈ మార్గం గుండా రైతులు రోడ్డుకు చేరవేస్తుంటారు. ఈ రహదారి పక్కన కాశి వెంకటేశ్వరరావు అనే వ్యక్తి స్థలాన్ని కొనుగోలు చేశాడు. గతంలో కొంతమంది రైతులు స్థలాన్ని కొనుగోలు చేసి రోడ్డు వేయాలని పంచాయతీకి సంబంధిత డాక్యుమెంట్స్ సమర్పించారు. అయితే సరిహద్దుదారుడు రోడ్డును అడ్డుకునేందుకు అడ్డంగా కర్రలు పాతాడు. అంతేకాక తాసిల్దార్ కు ఫిర్యాదు చేశాడు. దీంతో తహసిల్దార్ రవికిరణ్ ఆ ప్రాంతాన్ని పరిశీలించి ఇరు వర్గాలకు సర్వే నిమిత్తం నోటీసులు ఇవ్వాలనిసర్వేయర్ను ఆదేశించారు. శనివారం సంబంధిత అధికారులు సర్వే నిర్వహించేందుకు ఆ ప్రాంతానికి వెళ్లారు. ఉమ్మడి రహదారి కావడంతో ఆ గ్రామస్తులంతా పెద్ద ఎత్తున ఆ ప్రాంతానికి చేరుకున్నారు. ఫిర్యాదుదారుడు సర్వేకుసహకరించలేదని అధికారులు తెలిపారు. దీంతో ఆగ్రహం కట్టలు తెంచుకున్న గ్రామస్తులందరూ ఏకమై తామే స్వయంగాఅధికారుల సమక్షంలో గ్రావెల్ రోడ్డు నిర్మించారు.

# ఈ నెల 28న రామచంద్రపురంలో జాబ్ మేళా



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం నియోజకవర్గంలో నిరుద్యోగ నిర్మూలన కోసం ప్రతీ వారం రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ అధినేత వాసంశెట్టి సత్యం ఆధ్వర్యంలో నిర్వహించే జాబ్ మేళా ఈ నెల 28వ తేదీన రామచంద్రపురంలో కెవిఆర్ హాస్పిటల్ వెనక ఉన్న ఉపాధి కార్యాలయంలో 43 వ జాబ్ మేళా జరుగుతుంది. ఈ జాబ్ మేళాలో ఏడికో ద్వారా ఎయిర్టెల్ ఫైబర్ నెట్ లో హెచ్ డి ఓ ఇంజనీర్ మరియు వైర్ మెన్ పోస్టుల కొరకు ఇంటర్వ్యూ నిర్వహించబడుతున్నాయి. దీనిలో భాగంగా పదో తరగతి, డిగ్రీ ,బి.టెక్ ఈసీఈ, ఈఈఈ చదివిన 30 సంవత్సరాలలోపు పురుష అభ్యర్థులకు ఇంటర్వ్యూ నిర్వహించబడుతున్నాయి. ఎంపికైన వారికి తెలంగాణలో హెచ్‌డిఓ ఇంజనీర్‌కు రూ.23000/- వైర్ మెన్ రూ.17,000/- అదేవిధంగా ఆంధ్రప్రదేశ్లో రాజమండ్రి, కాకినాడ, అమలాపురం మరియు ఇతర ఏపీ అంతా పనిచేసే విధంగా హెచ్‌డిఓ ఇంజనీర్లకి రూ.20000/- వైర్ మెన్‌కి రూ. 13000/- లభిస్తుంది. మిగిలిన వివరాల కోసం 7075704852, 707590485 నెంబర్లలో సంప్రదించాలని మంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

# సీఎంను కలిసిన ఎమ్మెల్యే బండారు



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** కొత్తపేట గవర్నమెంట్ హాస్పిటల్ (సిహెచ్‌సి)ని 50 పడకల నుంచి 100 పడకలకు పెంచాలని కోరిన ఎమ్మెల్యే వాడపల్లిలో టీటీడీ ద్వారా రూ.12 కోట్లతో శ్రీనివాసం - 2 నిర్మాణంతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు కేటాయించాలని విజ్ఞప్తి ముఖ్యమంత్రి సహాయనిధి నిధులు మంజూరుకై వినతి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు శనివారం వెలగపూడి సచివాలయంలో కలిశారు.నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు మంజూరు చేయాలని కోరారు. ముఖ్యంగా కోనసీమ తిరుమల వాడపల్లి లో శ్రీనివాసం -2గదులు, డార్మెటరీల నిర్మాణానికి రూ.12కోట్లు టీటీడీ నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. కొత్తపేట సీహెచ్సీని 50 పడకల నుంచి 100 పడకలకు పెంచాలని కోరారు. ముఖ్యమంత్రి సహాయనిధి దరఖాస్తులను పరిశీలించి నిధులు మంజూరు చేయాలని కోరారు.లొల్ల లాకుల పునర్నిర్మాణానికి నిధులు కేటాయించినందుకు గాను ఆయనకు కృతజ్ఞతలు తెలియజేశారు. నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు అందజేయాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే బండారు తెలిపారు.



### "సర్" పై 24న అన్నవరంలో

# ప్రత్తిపాడు వైకాపా అవగాహనా సదస్సు

## విజయవంతం చేయాలని ముద్రగడ గిరిబాబు పిలుపు

**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** "సర్" ప్రక్రియపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పార్టీ శ్రేణులను అప్రమత్తం చేసేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సమాయత్తమైంది. రాష్ట్రంలోని అన్ని నియోజక వర్గాల్లోనూ అవగాహనా సమావేశాలను నిర్వహిస్తోంది. ఈ క్రమంలో కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం అవగాహనా సమావేశాన్ని శంఖవరం మండలం అన్నవరంలోని శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి దేవస్థానం నర్సరీ గార్డెన్ ఎదురుగా ఉన్న కే.కే. ఫంక్షన్ హాలులో ఆదివారం 24 న మధ్యాహ్నం 3 గంటలకు సర్ పై ప్రత్యేక అవగాహన, కార్యాచరణ సమావేశాన్ని ప్రత్తిపాడు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నిర్వహిస్తోంది. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. దేశ వ్యాప్తంగా పారదర్శకమైన ఓటర్ల జాబితాను సిద్ధం చేయడం కోసం "ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ" ప్రక్రియ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ – సర్)ను కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టింది. ఓటర్ల జాబితాలో ఉన్న లోపాలను సరిదిద్ద డానికి, నకిలీ ఓట్లను తొలగించ డానికి అర్హులైన వారికి మాత్రమే ఓటు హక్కును కల్పించ డానికి ఈ ఉధృత సర్వేను నిర్వహిస్తున్నారు. బూత్ లెవెల్ అధికారులు ప్రతి ఇంటికీ వచ్చి ఓటర్ల వివరాలను క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలిస్తారు. ఈ ప్రక్రియ త్వరలోనే ప్రారంభం కానుంది. ఈ సర్ లో ఒకే వ్యక్తికి రెండు లేదా అంతకంటే ఎక్కువ చోట్ల ఓట్లు ఉంటే, ఒక ప్రాంతాన్ని వదిలి వేరే ప్రాంతానికి శాశ్వతంగా మారి పోయినవారు, మరణించిన, నకిలీ పత్రాలు లేదా తప్పుడు



సమాచారంతో ఓటు నమోదు చేసుకున్నవారు, భారత పౌరసత్వం లేనివారు, ఇంకా 18 ఏళ్లు నిండని ఓటర్ల పేర్లను జాబితా నుండి తొలగిస్తారు. ఎవరి ఓట్లైనా తొలగించే ముందు బీఎల్ఓలు సంబంధిత వ్యక్తికి ముందస్తుగా నోటీసు ఇస్తారు. సదరు ఓటరు తన ఓటును సమర్థించు కోవడానికి, అవసరమైన ఆధారాలు చూపించడానికి వీలుగా ఎన్నికల సంఘం నెల రోజుల గడువు ఇస్తుంది. ఐతే ఈ సర్ నేపథ్యంలో నియోజకవర్గ స్థాయి ముఖ్య సమావేశం పేరుతో ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం అన్నవరంలోని దేవస్థానం నర్సరీ గార్డెన్ ఎదురుగా ఉన్న కే.కే. ఫంక్షన్ హాలులో ఆదివారం 24 న మధ్యాహ్నం 3 గంటలకు సర్ పై ప్రత్యేక అవగాహన, కార్యాచరణ సమావేశాన్ని ప్రత్తిపాడు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నిర్వహిస్తోంది. దీనికి ముఖ్య అతిథిగా ఆ పార్టీ కాకినాడ జిల్లా అధ్యక్షులు దాడిశెట్టి రాజా, జిల్లా పరిశీలకులు దాట్ల సూర్యనారాయణరాజు వై.కా.పా. సర్ టాస్క్ ఫోర్స్ సభ్యులు బి.వి.ఆర్. చౌదరి, ఒమ్మి రఘురామ, వాసిరెడ్డి జమీల్ హాజరు కానున్నారు. ఈ సర్ సమావేశంలో ఓటరు హక్కుల పరిరక్షణకు, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధతకు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అర్హత నిర్ధారణకు కీలకమైన ప్రక్రియగా ఉండనుందని, స్థానిక సంస్థల ఎన్నికలు, పలు సంక్షేమ పథకాల అమలులో సర్ సమాచాం కీలక పాత్ర పోషించే నేపథ్యంలో ప్రతీ నాయకుడు, కార్యకర్త సర్ పై సంపూర్ణ అవగాహన కలిగి ఉండటం అత్యంత అవసరమని, ఈ సమావేశంలో అందించే సమాచారం భవిష్యత్ ఎన్నికల నిర్వాహణకు, ఓటర్ల హక్కుల పరిరక్షణకు ఎంతో ఉపయోగ పడుతుందని ముఖ్య సందేశం ఇవ్వనున్నారు. జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, గ్రామ పార్టీ అధ్యక్షులు, గ్రామాల ముఖ్య నాయకులు అందరూ తప్పనిసరిగా హజరై సర్ పై అవగాహన పెంచుకోవాలని, ఈ విలువైన సమాచారాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఓటర్ల హక్కులను కాపాడు కోవాలని ప్రత్తిపాడు నియోజకవర్గం వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముద్రగడ గిరిబాబు శనివారం విజ్ఞప్తి చేసారు.

# రాజ్యసభ ఆశావాహులు.. ఏపీలో 4 స్థానాల కోసం పోటాపోటీ

సరిగ్గా నెల వ్యవధిలో ఏపీలోని రాజ్యసభ స్థానాల్లో నాలుగు స్థానాలు ఖాళీ కానున్నాయి. దీంతో.. ఏపీలోని కూటమి సర్కారులో రాజ్యసభలో చోటు దక్కించుకోవటం కోసం పోటీ పెరిగింది. అందుకు తగ్గట్లే.. ఎవరికి వారు తమ ప్రయత్నాలు షురూ చేశారు. నాలుగు పోస్టులకు భారీగా ఆశావాహుల సంఖ్య ఉండటంతో తుదకు ఆ స్థానాల్ని దక్కించుకునే వారెవరు? అన్నదిప్పుడు ఆసక్తికరంగా మారింది. విశ్వసనీయ వర్గాలనుంచి అందుతున్న సమాచారం ప్రకారం కూటమి ప్రభుత్వంలో టీడీపీ.. జనసేన.. బీజేపీల్లో ఏ పార్టీకి ఎన్నిసీట్లు? అన్నది ప్రశ్నగా మారింది. ఇందుకు సమాధానంగా తెలుగుదేశం పార్టీకి రెండు స్థానాలు.. మిత్రపక్షాలైన జనసేన.. బీజేపీలకు ఒక్కో స్థానం చొప్పున కేటాయిస్తారన్న మాట బలంగా వినిపిస్తోంది. నిజానికి బీజేపీకి ఉన్న అసెంబ్లీ స్థానాల పరంగా చూస్తే.. ఒక స్థానాన్ని కేటాయించటం ఎక్కువే అయినప్పటికి.. కేంద్రంలోని ఎన్డీయే భాగస్వామిగా ఉన్న నేపథ్యంలో.. బీజేపీకి ఒక స్థానం ఇవ్వక తప్పని పరిస్థితి. ఇదిలా ఉండగా మరోవాదన కూడా వినిపిస్తోంది. 2025లో విజయసాయి రెడ్డి రాజీనామాతో ఖాళీ అయిన రాజ్యసభ స్థానాన్ని బీజేపీకి ఇచ్చిన నేపథ్యంలో.. తాజాగా ఖాళీగా ఉన్న నాలుగు స్థానాల్లో మూడు తెలుగుదేశం.. ఒకటి జనసేనకు కేటాయించేలా సర్దుబాటు జరుగుతుందన్న ప్రచారం జరుగుతోంది. అయితే.. రాజ్యసభలో తమ పార్టీ సంఖ్యా బలంపై బీజేపీ అధినాయకత్వం ప్రత్యేక ఆసక్తి ఉన్న నేపథ్యంలో.. తాజా నాలుగు స్థానాల్లో ఒక్కటి కూడా తమకు కేటాయించని ప్రపోజల్ కు కమలనాథులు ఓకే అంటారా? అన్నది కూడా ప్రశ్నే. ఒకవేళ.. తమకు స్థానం కేటాయించకున్నా ఫర్లేదన్న మాట బీజేపీ అధినాయకత్వం నుంచి వస్తే మాత్రం.. అదో గొప్ప విషయం అవుతుందన్న మాట వినిపిస్తోంది. ఖాళీగా ఉన్న నాలుగు స్థానాల్లో కూటమి ప్రభుత్వంలోని మూడు పార్టీల్లో ఎవరికెన్ని స్థానాలన్న



విషయంపై క్లారిటీ ఒక ఎత్తు అయితే.. ఆయా స్థానాల్ని సొంతం చేసుకోవటానికి ఆయా పార్టీలకు చెందిన నేతలు.. మద్దతుదారులు.. బడాబాబులు భారీ ఎత్తున ప్రయత్నాలు చేస్తున్నట్లుగా తెలుస్తోంది. ఒకవేళ బీజేపీకి ఒక స్థానాన్ని కేటాయించిన పక్షంలో రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు మాధవ్ కు అవకాశం దక్కుతుందని చెబుతున్నారు. అలా కాని పక్షంలో ఇతర రాష్ట్రాలకు చెందిన వారికి దక్కే వీలుందని చెబుతున్నారు. బీజేపీ సంగతి ఇలా ఉంటే.. జనసేన పార్టీ విషయానికి వస్తే.. ఆ పార్టీకి కేటాయించే ఒక స్థానానికి తీవ్రమైన పోటీ ఉన్నట్లుగా చెప్పాలి. జనసేన నుంచి రాజ్యసభ స్థానానికి పోటీ పడుతున్న వారిలో ముందంజలో ఉన్నది మాత్రం లింగమనేని రమేశ్ గా చెబుతున్నారు. ఒకవేళ ఆయనకు అవకాశం లభిస్తే.. ఆ ప్రభావం తెలుగుదేశం మీద తప్పనిసరిగా ఉంటుందని చెబుతున్నారు. దీనికి కారణం లేకపోలేదు. లింగమనేనికి అవకాశం ఇస్తే.. ఆయన సామాజిక వర్గానికి చెందిన టీడీపీ ఆశావాహులకు గండిపడినట్లేనని చెప్పక తప్పదు. ఒక సామాజిక వర్గానికి చెందిన వారిలో ఒకరికి మాత్రమే అవకాశం దక్కుతుంది. అందుకే.. జనసేన డిసైడ్ చేసే వారికి అనుగుణంగా తెలుగుదేశం ఆశావాహుల అవకాశాలు మారతాయని చెప్పక తప్పదు. జనసేనకు సంబంధించి పలువురు రాజ్యసభ స్థానం మీద ఆశలు పెట్టుకున్నప్పటికి.. ఈసారికి మాత్రం లింగమనేనికి అధిక అవకాశాలు ఉన్నట్లుగా తెలుస్తోంది. తెలుగుదేశం పార్టీ విషయానికి వస్తే.. పార్టీ కోసం ఎంతో కాలంగా పని చేస్తూ.. లోకేశ్ కు అత్యంత సన్నిహితుల్లో ఒకరిగా చెప్పే కిలారు రాజేశ్ రాజ్యసభలో చోటు కోసం ప్రయత్నాలు చేస్తున్నట్లుగా చెప్పాలి. భాష్యం విద్యాసంస్థల అధినేత భాష్యం రామక్రిష్ణ.. గుంటూరు మాజీ ఎంపీ గల్లా జయదేవ్.. మాజీ రాజ్యసభ సభ్యులు కంభంపాటి రామ్మోహన్ రావు లాంటి వారి పేర్లు ఆశావాహుల రేసులో ఉన్నాయి. అయితే.. వీరంతా ఒకే సామాజిక వర్గానికి చెందిన వారు కావటంతో.. వీరిలో ఒకరికి మాత్రమే అవకాశం దక్కుతుందని చెప్పక తప్పదు. అదే సమయంలో జనసేన నుంచి లింగమనేనికి చోటు లభిస్తే.. ఈ నలుగురికి నిరాశ ఖాయం. టీడీపీ నుంచి ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వర్ల రామయ్యతో పాటు ఐటీడీపీ ఇన్ చార్జి స్పీకర్ అయ్యన్నపాత్రుడి కుమారుడు విజయ్ బీసీ కోటాలో ప్రయత్నాలు చేస్తున్నట్లుగా చెబుతున్నారు. ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరికి చంద్రబాబు అవకాశం ఇస్తారా? అన్నది సందేహమే. సామాజిక వర్గాలు.. ప్రాంతాల సమతూకాన్ని పాటించాల్సిన పరిస్థితుల్లో కోస్తాకు చెందిన నేతకు ఒక స్థానాన్ని కేటాయిస్తే.. ఉత్తరాంధ్ర కంటే రాయలసీమకు చెందిన నేతకు చంద్రబాబు ప్రాధాన్యత ఇవ్వొచ్చన్న ప్రచారం జరుగుతోంది. అదే జరిగితే.. రెడ్డప్పగారి శ్రీనివాసరెడ్డి రాజ్యసభ రేసులో ఉన్నారు. ఓవైపు రాజ్యసభ ఖాళీలు.. మరోవైపు కేంద్రమంత్రి వర్గ విస్తరణ వార్తల నేపథ్యంలో పలువురు ఆశావాహులు సీఎం చంద్రబాబును కలిసేందుకు క్యూ కడుతున్నారు. మరి.. రాజ్యసభ అభ్యర్థులుగా చంద్రబాబు ఎవరికి అవకాశం ఇస్తారన్నదిప్పుడు ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# రఘురామ కొత్త పార్టీ 'తెలుగు వీర లేవరా'..

డిప్యూటీ స్పీకర్ రఘురామరాజు కొత్త పార్టీ పెడుతున్నారంటూ జరుగుతున్న ప్రచారంపై క్లారిటీ ఇచ్చారు. 'తెలుగు వీర లేవరా' అనే సొసైటీని స్థాపించిన డిప్యూటీ స్పీకర్ దానిని రాజకీయ పార్టీగా మార్చనున్నారని సోషల్ మీడియా వేదికగా భారీ ప్రచారం జరుగుతోంది. దీంతో అప్రమత్తమైన రఘురామరాజు ఆ ప్రచారంపై స్పష్టత ఇచ్చారు. కొందరు కావాలనే కొత్త పార్టీ పెడుతున్నానంటూ అసత్య ప్రచారం చేస్తున్నారని వివరణ ఇచ్చారు. డిప్యూటీ స్పీకర్ రఘురామ రాజు ఇచ్చిన క్లారిటీతో కొత్త పార్టీ పెడుతున్నారని జరుగుతున్న ప్రచారం ఉత్తిదే అని తేలిపోయిందని అంటున్నారు. కొత్త పార్టీ అంటూ జరుగుతున్న ప్రచారం ఖండిస్తూ రఘురామరాజు వీడియో విడుదల చేశారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులపై అవగాహన కల్పించేందుకు మాత్రమే తాను 'తెలుగు వీర లేవరా' అన్న సొసైటీని ప్రారంభించానని డిప్యూటీ స్పీకర్ తెలిపారు. తప్పుడు కేసులతో తాను పడిన ఇబ్బందులు మరెవరూ పడకూడదనే ఉద్దేశంతోనే సొసైటీని ప్రారంభించానని రఘురామ వెల్లడించారు. ఈ అంశాలపై ప్రజల

### క్లారిటీ ఇచ్చిన డిప్యూటీ స్పీకర్!



ఇబ్బందులను తెలుసుకుంటూ వారికి సూచనలు, సలహాలు ఇచ్చేందుకు తమ సొసైటీ పనిచేస్తుందని వెల్లడించారు. కానీ, గిట్టని వ్యక్తులు తమ సొసైటీని కొత్త పార్టీ అంటూ దుష్ప్రచారం చేయడం ద్వారా కూటమిలో విభేదాల సృష్టికి పనిచేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మొత్తానికి ఈ వీడియోతో రఘురామరాజు కొత్త పార్టీ పెడుతున్నారంటూ జరుగుతున్న ప్రచారానికి ఫుల్ స్టాప్ పెట్టే ప్రయత్నం చేశారని అంటున్నారు. రఘురామరాజు సొంత నియోజకవర్గంలో రామాలయ నిర్మాణంపై వివాదం నెలకొన్న విషయం తెలిసిందే. అకివీడు పెదపేటలో రామాలయ నిర్మాణానికి కంకణం కట్టుకున్న రఘురామ ఓ వర్గంపై పోరాడుతున్నారని చెబుతున్నారు. అయితే ఈ విషయంలో టీడీపీ అధిష్టానం ఆయనకు మద్దతుగా నిలవడంపై తర్జనభర్జన పడుతోందని, దీంతో అసంతృప్తి చెందిన రఘురామ కొత్త పార్టీ పెట్టుకోవాలనే ఆలోచన చేస్తున్నారని కొద్దిరోజులుగా సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోందని చెబుతున్నారు. అయితే రాజకీయ ప్రత్యర్థులు తన ప్రతిష్టను దెబ్బతీసేందుకు ఈ ప్రచారం ప్రారంభించారని వెంటనే గుర్తించిన డిప్యూటీ స్పీకర్ ప్రత్యేకంగా వీడియో విడుదల చేశారు. దీంతో రఘురామకు టీడీపీకి మధ్య మంచి అనుబంధం కొనసాగుతుందని తేలిపోయిందని అంటున్నారు.

# రెండు వర్గాలుగా టీడీపీ..

## ఖండాంతరాలలోనూ రాజకీయమేనా?



తెలుగుదేశం ఎన్ఆర్ఐ విభాగంలో వర్గ విభేదాలు తీవ్ర చర్చనీయాంశంగా మారుతున్నాయని అంటున్నారు. గల్ఫ్ దేశాల్లో టీడీపీ నేతలు రెండు వర్గాలుగా విడిపోయి పోటాపోటీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని చెబుతున్నారు. విదేశాల్లోనూ ఈ తరహా రాజకీయంతో పార్టీకి తలనొప్పిగా మారుతున్నారని పలువురు ఎన్ఆర్ఐ టీడీపీ నేతలపై కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొంతకాలంగా గల్ఫ్ టీడీపీ విభాగంలో కొనసాగుతున్న ఆధిపత్య పోరుతో పార్టీ నేతలు పరస్పరం ముఖాలు కూడా చూసుకోని బద్ధ విరోధుల్లా వ్యవహరిస్తున్నారని అంటున్నారు. ఈ పరిస్థితులతో గల్ఫ్ టీడీపీలో గందరగోళం చోటుచేసుకుందని చెబుతున్నారు. ఇక ఎన్ఆర్ఐ నేతల వ్యవహారశైలితో గల్ఫ్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమాలలో పాల్గొనేందుకు వెళుతున్న రాష్ట్ర నేతలు కూడా ఇబ్బంది పడుతున్నట్లు చెబుతున్నారు. అయితే ఒక నేత మాత్రం వర్గాలను పెంచేలా వ్యవహరిస్తున్నారని జరుగుతున్న ప్రచారం మరింత హీట్ పుట్టిస్తోందని అంటున్నారు. తరచూ గల్ఫ్ కు వస్తున్న ఆ నేత అగ్నికి ఆజ్యం పోసేలా ప్రవర్తిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇక గల్ఫ్ టీడీపీలో విభేదాలు ఉన్నట్లు జరుగుతున్న ప్రచారం ఎన్ఆర్ఐ టీడీపీలో కలవరం పుట్టిస్తోందని అంటున్నారు. ఎన్ఆర్ఐ నేతలుగా చెప్పుకునే వారు కూడా పార్టీ కార్యక్రమాలకు అంటీముట్టనట్లు వ్యవహరిస్తున్నారని, స్థానికంగా ఉన్న కార్యకర్తలను కూడా కలవడం లేదని అంటున్నారు. విదేశాల నుంచి వచ్చే పార్టీ నేతలను కలిసేందుకు కూడా గల్ఫ్ లో ఉన్న ఒక పెద్ద ఇష్టపడటం లేదని అంటున్నారు. ఆయన అలా ఎందుకు ప్రవర్తిస్తున్నారనేది ఎవరికీ అంతుచిక్కడం లేదన్న చర్చ ఆసక్తి రేపుతోంది. రాజకీయంగా కీలకమైన గల్ఫ్ ప్రాంతాన్ని పార్టీ నాయకత్వం నిర్లక్ష్యం చేయడంపై కార్యకర్తలు ఆందోళన చెందుతున్నారని అంటున్నారు. మరోవైపు పార్టీ హైకమాండ్ గల్ఫ్ టీడీపీని పట్టించుకోవడం లేదని, ఎక్కువగా అమెరికా, బ్రిటన్‌లో ఉండే పార్టీ నేతలకే అవకాశాలు ఇస్తున్నారని, ఆయా శాఖలకే ప్రాధాన్యం ఇస్తున్నారని పశ్చిమాసియాలో ఉన్న కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా, గల్ఫ్ టీడీపీ విభేదాలు ఉన్నాయనే విషయం తాజాగా మరోమారు బయటపడింది. పార్టీ మహానాడుకు ముందు జిల్లాల్లో మినీ మహనాడు నిర్వహించినట్లే, విదేశాల్లో సమావేశాలు జరుగుతున్నాయి. ఇక శుక్రవారం ఖతార్ లో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి కొలుసు పార్థసారథి హాజరయ్యారు. అయితే మరోవర్గం కూడా ఖతార్ లో సమావేశం ఏర్పాటు చేసి దీనికి పెనమలూరు ఎమ్మెల్యే బొడే ప్రసాద్ ను ముఖ్య అతిథిగా తీసుకువచ్చింది. దీంతో ఒకే రోజు, ఒకే దేశంలో రెండు వేర్వేరు సమావేశాలు జరగడం కార్యకర్తల్లో గందరగోళానికి దారితీసిందని అంటున్నారు. ఈ పోటాపోటీ కార్యక్రమాలను అడ్డుకునేందుకు రెండు పక్షాలు చివరి వరకు ప్రయత్నించాయని కూడా చెబుతున్నారు. ఈ పరిణామాలు గల్ఫ్‌లో ఉంటున్న టీడీపీ కార్యకర్తలను ఆవేదనకు గురిచేస్తున్నాయి. పశ్చిమాసియాలో సుమారు 5 లక్షల మంది తెలుగువారు పనిచేస్తున్నారని చెబుతున్నారు. ఇందులో గోదావరి జిల్లాల వాసులతోపాటు రాయలసీమ ప్రాంతానికి చెందిన వారు ఎక్కువగా ఉన్నారని అంటున్నారు. పార్టీలో పరిణామాలను ప్రత్యర్థులు అనుకూలంగా మలచుకునే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. గల్ఫ్ లోనే ఉంటున్న మలయాళీలు పార్టీలను బలోపేతం చేసుకుంటుంటే, టీడీపీలో మాత్రం భిన్నమైన పరిస్థితులు ఉన్నాయని కార్యకర్తలు వాపోతున్నారు. ప్రధానంగా గ్రూపు రాజకీయాలు, కులాల ఆధిపత్యం వల్ల పార్టీకి నష్టం చేస్తోందన్న వాదన వినిపిస్తోంది. ఈ పరిస్థితిని సరిదిద్దేందుకు హైకమాండ్ తక్షణమే దిద్దుబాటు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# పదవి నుంచి తప్పుకున్న ఎమ్మెల్యే అరవ శ్రీధర్

## డిప్యూటీ సీఎం పవన్‌కు రాజీనామా పత్రం



ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. జనసేన పార్టీకి చెందిన కీలక నేత, రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ ప్రభుత్వ విప్ పదవికి రాజీనామా చేశారు. శనివారం మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయం లో జనసేన పార్టీ అధ్యక్షులు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను కలిసిన తన రాజీనామా పత్రాన్ని అందజేశారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత జనసేన పార్టీలో ఒక కీలక ప్రజాప్రతినిధి తన పదవికి రాజీనామా చేయడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

**కారణం ఇదేనా..?**

విప్ పదవి నుంచి ఎమ్మెల్యే శ్రీధర్ తప్పుకోవడం రాజకీయంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. వ్యక్తిగత కారణాల వల్లే తాను విప్ పదవికి రాజీనామా చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. అయితే, గత కొన్ని రోజులుగా ఆయన చుట్టూ నెలకొన్న వివాదాలతో శ్రీధర్ ను రాజీనామా చేయాల్సిందిగా పార్టీ అధిష్టానం ఆదేశించినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలోనే ఆయన అధినేత పవన్ కళ్యాణ్‌ను కలిసి తన వాదన వినిపించారని, పార్టీ కోసం క్రమశిక్షణతో పనిచేస్తానని వివరణ ఇచ్చినట్లు చెబుతున్నారు. ఎమ్మెల్యే శ్రీధర్‌పై రైల్వేకోడూరుకు చెందిన ఓ మహిళ ఆరోపణలు చేయడం తీవ్ర సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. పెళ్లి చేసుకుంటానని ఎమ్మెల్యే తనను మోసం చేశారని ఆ మహిళ ఆరోపించగా, తనను హనీట్రాప్ చేశారని ఎమ్మెల్యే పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంతో జనసేన పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండాలని ఎమ్మెల్యేను పార్టీ హైకమాండ్ ఆదేశించిందని చెబుతున్నారు. అయినప్పటికీ జనసేన వ్యవహారాల్లో ఎమ్మెల్యే చురుగ్గా పాల్గొంటున్నారని సదరు మహిళ ఆరోపణలు చేస్తూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే శ్రీధర్ ప్రభుత్వ విప్ పదవికి రాజీనామా చేయడం చర్చనీయాంశంగా మారిందని చెబుతున్నారు. ఇటీవలి కాలంలో తనపై వచ్చిన ఆరోపణలు, నియోజకవర్గంలో నెలకొన్న కొన్ని వివాదాస్పద అంశాలపై ఎమ్మెల్యే అరవ శ్రీధర్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు స్వయంగా వివరించారని అంటున్నారు. క్షేత్రస్థాయిలో అసలేం జరిగింది? ఆరోపణల వెనక ఉన్న వాస్తవాలేంటి? అనే విషయాలను పవన్‌కు పూసగుచ్చినట్లు వివరించినట్లు పార్టీ వర్గాల సమాచారం. వివాదాలకు దూరంగా ఉండటంతో పాటు, పార్టీ ప్రతిష్టకు భంగం కలగకూడదనే ఉద్దేశంతోనే ఆయన ముందస్తుగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

**రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్**

రైల్వే కోడూరు నుంచి జనసేన జెండా ఎగురవేసి, విప్‌గా బాధ్యతలు చేపట్టిన ఎమ్మెల్యే అరవ శ్రీధర్ రాజీనామా చేయడం సంచలనంగా మారింది. విప్ పదవికి రాజీనామా చేసినప్పటికీ, జనసేన పార్టీలోనే ఎమ్మెల్యేగా కొనసాగుతారని, కేవలం ఆరోపణలపై వివరణ ఇచ్చి పదవి నుంచి తప్పుకున్నారని పార్టీ శ్రేణులు స్పష్టం చేస్తున్నాయి. ఈ రాజీనామాను పవన్ కళ్యాణ్ ఆమోదించారా లేదా అనేదానిపై జనసేన పార్టీ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉందని అంటున్నారు.



# "ఆపరేషన్ క్లీన్ స్వీప్"తో పారిశుద్ధ్యం మెరుగు

- శానిటేషన్ సిబ్బందితో జెండా ఊపి ప్రారంభించిన కార్యక్రమం
- నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో "ఆపరేషన్ క్లీన్ స్వీప్" కార్యక్రమం
- చీపురు పట్టి రోడ్లు శుభ్రం చేసిన కలెక్టర్ కీర్తి చేకూరి, కమిషనర్ రాహుల్ మీనా





**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని మునిసిపాలిటీలు, నగరపాలకసంస్థల్లో "ఆపరేషన్ క్లీన్ స్వీప్" పేరిట నేటి నుంచి జూన్ 20 వరకు నాలుగు వారాల పాటు ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టనున్నట్లు జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. శనివారం నగరపాలకసంస్థ కార్యాలయం నుంచి ఆనం కళాకేంద్రం మీదుగా గోదావరి రైల్వే స్టేషన్ వరకు నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో "ఆపరేషన్ క్లీన్ స్వీప్" కార్యక్రమాన్ని కమిషనర్ రాహుల్ మీనాతో కలిసి కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా శానిటేషన్ సిబ్బందితో జెండా ఊపి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులతో కలిసి రోడ్లపై ఉన్న చెత్తను చీపురు పట్టి శుభ్రం చేశారు. బహిరంగ మలమూత్ర విసర్జనను అరి కట్టేందుకు ప్రజలకు అవగాహన కల్పించేలా వాల్ పెయింటింగ్స్ చేపట్టారు. అనంతరం కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ.. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర స్ఫూర్తితో జిల్లాలో "ఆపరేషన్ క్లీన్ స్వీప్" డ్రైవ్‌ను పకడ్బందీగా అమలు చేయనున్నట్లు తెలిపారు. నెల రోజులపాటు నగరాలు, పట్టణాలలోని పరిసరాలను శుభ్రం చేయడం, ప్రజలను భాగస్వామ్యం చేయడం కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. ఇందులో భాగంగా తొలివారం రెడ్ స్పాట్లు, ఎల్లో స్పాట్లను ప్రత్యేకంగా గుర్తించి, వాటిని పూర్తి స్థాయిలో క్లియర్ చేయడం జరుగు తుందన్నారు. రెండో వారం నగరంలోని ప్రధాన డ్రెయిన్లు, సైడ్ డ్రెయిన్లలో పేరుకుపోయిన పూడిక, వ్యర్థాలను తొలగించేందుకు ఉధృతంగా పనులు చేపడతామని వివరించారు. మూడవ వారంలో చెత్త ఎక్కువగా ఉత్పత్తి అయ్యే మార్కెట్లు, వాణిజ్య ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి, అక్కడ పేరుకుపోయిన చెత్తను పూర్తిస్థాయిలో తొలగించడం ద్వారా పరిసరాల స్వచ్ఛతను కాపాడుతామన్నారు. నాల్గవ వారం నగరంలోని సామూహిక మరుగుదొడ్ల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుందన్నారు. ఈ డ్రైవ్‌లో రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ అద్భుతమైన ప్రతిభ కనబరచి.. రాష్ట్రంలోనే ఉత్తమ మున్సిపాలిటీగా గుర్తింపు తెచ్చుకోవాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇందుకు నగర పౌరుల సహకారం ఎంతో ముఖ్యమన్నారు. అలాగే వ్యర్థాల వర్గీకరణపై ప్రజలు పూర్తి అవగాహన కలిగి ఉండాలని.. ఇంటింటికి వచ్చే వాహనానికి తడిచెత్త, పొడిచెత్తను వేరు చేసి అందించాలని కలెక్టర్ కీర్తి చేకూరి విజ్ఞప్తి చేశారు. కమిషనర్ రాహుల్ మీనా మాట్లాడుతూ నగర ప్రజల ఆరోగ్యం, నగర సుందరీకరణే ధ్యేయంగా ఈ "ఆపరేషన్ క్లీన్ స్వీప్" కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇది కేవలం ఒక్క రోజు కార్యక్రమం కాదని, నగర వ్యాప్తంగా ప్రతి వీధి, ప్రతి వార్డు పరిశుభ్రంగా మారేంతవరకు ఈ ప్రత్యేక డ్రైవ్ నిరంతరాయంగా కొనసాగుతుందన్నారు. రాజమహేంద్రవరాన్ని రాష్ట్రంలోనే ఆదర్శవంతమైన స్వచ్ఛ నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా నగర ప్రజలు కూడా తమ ఇళ్లను, వ్యాపార సంస్థలను శుభ్రంగా ఉంచుకుంటూ, చెత్తను ఎక్కడపడితే అక్కడ పారేయకుండా ప్రజారోగ్య కార్మికులకు అందించాలని సూచించారు. అలాగే అధికారులు, ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలందరూ భాగస్వాములై "ఆపరేషన్ క్లీన్ స్వీప్" కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా కోరారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ పి.వి.రామలింగేశ్వర్, డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకట రమణ, సెక్రటరీ జి.శైలజవల్లి, ఎస్ఈ రీటా, సిటీ ప్లానర్ జి.వి.ఎస్.ఎన్. మూర్తి, ఎంహెచ్ఓ వి . వినూత్న, మేనేజర్ అబ్దుల్ మలిక్, వివిధ కార్పొరేషన్ ల డైరెక్టర్లు, అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# విద్య.. వైద్యం.. క్రీడలకు ప్రోత్సాహంగా ఉంటాం

## ఫుట్‌బాల్ క్రీడాకారిణిలకు కిట్లు పంపిణీ - పేద విద్యార్థులకు ఫీజుల సహాయం : ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** సమాజ సేవే లక్ష్యంగా ముందుకు సాగుతున్న భవాని చారిటబుల్ ట్రస్ట్ మరోసారి తన సేవా కార్యక్రమాలతో పలువురికి అండగా నిలిచింది. విద్య, వైద్యం, క్రీడల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ ట్రస్ట్ ఆధ్వర్యంలో పలువురు పేద విద్యార్థులకు ఫీజుల కోసం ఆర్థిక సహాయం, అనారోగ్యంతో బాధపడుతున్న వారికి వైద్య సహాయం అందజేశారు రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ 41వ వార్డు నుంచి ఇద్దరు విద్యార్థులకు స్కూల్ ఫీజుల నిమిత్తం ఆర్థిక సహాయం అందించామని తెలిపారు. అలాగే రెండో వార్డుకు చెందిన ఓ సీనియర్ నాయకుడికి వైద్య చికిత్స కోసం సహాయం అందించడంతో పాటు, 1వ వార్డు నుంచి ఉన్నత విద్య కోసం ఒక విద్యార్థికి ఆర్థిక సహాయం అందించినట్లు చెప్పారు. అదేవిధంగా 38వ వార్డు నుంచి వైద్య అవసరాల కోసం మరో వ్యక్తికి ట్రస్ట్ తరఫున సహాయం చేసినట్లు వివరించారు. ఇదే సమయంలో స్థానికంగా ప్రతిభ కనబరుస్తున్న ఫుట్‌బాల్ క్రీడాకారిణిలకు కూడా భవాని చారిటబుల్ ట్రస్ట్ చేయూతనిచ్చింది. సరైన షూలు, క్రీడా సామగ్రి లేక ఇబ్బందులు పడుతున్నామని 13 మంది ఫుట్‌బాల్ క్రీడాకారిణిలు తమ కోచ్ ద్వారా తన దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్. ఇప్పటికే వివిధ స్థాయిల్లో మంచి ప్రతిభ కనబరుస్తూ ముందుకు సాగుతున్న ఆ చిన్నారులను మరింత ప్రోత్సహించాలనే ఉద్దేశంతో సుమారు రూ.32 వేల వ్యయంతో ప్రత్యేక క్రీడా కిట్లు అందించినట్లు చెప్పారు. ప్రతి క్రీడాకారిణికి ఫుట్‌బాల్ షూలు, సాక్స్, స్పోర్ట్స్ కిట్‌తో పాటు ఒక్కో ఫుట్‌బాల్‌ను కూడా అందజేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా చిన్నారులు ఆనందం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసుకు, ట్రస్ట్ కు కృతజ్ఞతలు తెలిపారు. గత రెండు సంవత్సరాలుగా మాత్రమే కాకుండా, తాము ప్రతిపక్షంలో ఉన్న సమయంలో కూడా భవాని చారిటబుల్ ట్రస్ట్ ద్వారా నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహించామని ఎమ్మెల్యే వాసు పేర్కొన్నారు. విద్య, వైద్యం, క్రీడల రంగాల్లో అవసరమైన వారికి సహాయం చేస్తూ ముందుకు సాగుతున్నామని, భవిష్యత్తులో కూడా ట్రస్ట్ పరిధిలో మరింత విస్తృతంగా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. సమాజంలోని ప్రతి వర్గానికీ అండగా నిలవాలనే సంకల్పంతో భవాని చారిటబుల్ ట్రస్ట్ పనిచేస్తోందని, ప్రజల ఆశీస్సులు, సహకారంతో సేవా కార్యక్రమాలను మరింత విస్తరించనున్నామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నగర అధ్యక్షులు మజ్జి రాంబాబు, నాయకులు వర్రే శ్రీనివాసరావు, కొయ్యల రమణ, ఉప్పులూరి జానకి రామయ్య, కడలి రామకృష్ణ, బుడ్డిగ రవి, శెట్టి జగదీష్, నందివాడ దినేష్, దాస్యం ప్రసాద్, సలాది ఆనంద్, కర్రి కాశీ, కందికొండ అనంత్, తాడి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# వైయస్సార్ పార్టీ బూత్ లెవెల్ ఏజెంట్లకు ఎస్ఐఆర్‌పై అవగాహన సదస్సు

## ఓటరు జాబితా పారదర్శకతే కీలకం : ఎమ్మెల్సీ తోట




**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** ప్రజాస్వామ్యంలో ఓటరు జాబితా పారదర్శకతే కీలకమని రాష్ట్ర సభార్డినేట్ కమిటీ చైర్మన్, మండపేట వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పేర్కొన్నారు. మండపేటలో వైఎస్సార్‌సీపీ బూత్ లెవెల్ ఏజెంట్లకు ఎస్ఐఆర్‌పై కీలక శిక్షణ సమావేశం నిర్వహించారు. సంగిత వెంకటరెడ్డి నగర్‌లోని జొన్నల శేషాయమ్మ అబ్బులు కాపు కళ్యాణ మండపంలో జరిగిన ఈ సమావేశంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ఎస్ఐఆర్ ప్రక్రియపై బీఎల్ఏలకు శిక్షణ ఇచ్చారు. పవర్ ప్రజెంటేషన్ ద్వారా ఎస్ఐఆర్ ప్రక్రియలోని ముఖ్యాంశాలను రాష్ట్ర, జిల్లా ప్రతినిధులు వివరించారు. ప్రతి బూత్ పరిధిలో ఓటర్ల జాబితాలను క్షుణ్ణంగా పరిశీలించాలని బీఎల్ఏలకు సూచించారు. అక్రమ చేర్పులు, తొలగింపులు గుర్తిస్తే వెంటనే బీఎల్వోలకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయాలని ఆదేశించారు. ఇతర పార్టీల అక్రమాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు మాట్లాడుతూ 2026 ఎన్నికల నేపథ్యంలో జాబితాలో ఒక్క అక్రమ ఓటు కూడా ఉండకుండా చూడాల్సిన బాధ్యత బీఎల్ఏలదేనని స్పష్టం చేశారు. అర్హులైన ఒక్క ఓటరు పేరు కూడా తొలగించకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియ ద్వారా డూప్లికేట్ ఓట్లు, మరణించిన వారి పేర్లు, వలస వెళ్లిన వారి పేర్లను తొలగించి, అర్హులైన కొత్త ఓటర్లను చేర్చడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి, వైసీపీ టాస్క్ ఫోర్స్ సభ్యులు ఒమ్మి రఘురాం, తోరం గౌతమ్, గొల్లపల్లి డేవిడ్, జిల్లా బూత్ కమిటీ అధ్యక్షుడు చీకట్ల కిషోర్, స్టేట్ బూత్ కమిటీ కార్యదర్శి మార్గని గంగాధరం, బీవీఆర్ చౌదరి, నియోజకవర్గ పరిశీలకుడు వంటెద్దు వెంకన్న నాయుడు, రాష్ట్ర కార్యదర్శి కర్రి పాపారాయుడు, జడ్పీటీసీలు, ఎంపీపీలు, మండల కన్వీనర్లు, బీఎల్ఏలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### ప్రజా సమస్యల పరిష్కారంలో

# అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలి : ఎమ్మెల్యే బత్తుల



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజానగరం నియోజకవర్గంలో అధికారులు ప్రజల సమస్యల పట్ల చిత్తశుద్ధితో పనిచేసి తక్షణమే పరిష్కరించాలని రాజానగరం శాసన సభ్యులు బత్తుల బలరామకృష్ణ అన్నారు. శనివారం రాజానగరం జనసేనపార్టీ కార్యాల యంలో ఆయన ప్రజలకు అందుబాటులో ఉండి, ప్రజల నుండి వచ్చిన పలు వినతులను స్వీకరించారు. నియోజకవర్గ పరిధిలోని మౌలిక వసతులు, తాగునీటి ఎద్దడి, అంతర్గత రోడ్ల నిర్మాణం, డ్రైనేజీలు, పింఛన్లు, రేషన్ కార్డుల వంటి పలు సమస్యలను ప్రజల నుండి స్వీకరించారు. అనంతరం సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి ఈ సమస్యను తక్షణమే పరిష్కరించాల న్నారు. ప్రజా సమస్యల పట్ల అధికారులు నిర్లక్ష్యం వహిస్తే సహించలేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, జన సైనికులు, వీర మహిళలు, ప్రజలు పాల్గొన్నారు.

# సీతానగరం వైద్యాధికారిగా డాక్టర్ వి.భవాని



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన వైద్యాధికారిగా డాక్టర్ వి.భవాని చార్జి తీసుకున్నారు. ఈ సందర్భంగా సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ ఎం. శైలజ రాణి, డాక్టర్ ఆర్.జగదీష్ కృష్ణ, ఎంపీహెచ్ఈఓ వైఎస్.రాయుడు, పిహెచ్ఎన్ కె.ఆదిలక్ష్మి, హెల్త్ సూపర్వైజర్ కె.సుధాకర్, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది డాక్టర్ భవానికి పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. డాక్టర్ ఏవి కి చైతన్య పై చదువుల నిమిత్తం వెళ్ళిన కారణంగా ఖాళీ అయిన వైద్యాధికారి పోస్టులో డాక్టర్ భవాని జాయిన్ అయినందుకు ప్రజల సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# ఆపరేషన్ క్లీన్ స్వీప్

## బస్ స్టాండ్ నుండి రాజారత్న జంక్షన్ వరకు భారీ శుభ్రత కార్యక్రమం



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు మండపేట పురపాలక సంఘం ఆధ్వర్యంలో శనివారం ఉదయం 8 గంటలకు ఆపరేషన్ క్లీన్ స్వీప్ ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం నిర్వహించారు. స్వచ్ఛాంధ్ర మిషన్ డైరెక్టర్ సలాది పట్టాభిరామయ్య, డిస్ట్రిక్ట్ కో-ఆర్డినేటర్ డి.వెంకటరావు, మండపేట పుర పాలక సంఘం స్పెషల్ ఆఫీసర్, రాజమహేంద్రవరం మునిసిపల్ రీజినల్ డైరెక్టర్ సి.హెచ్. నాగ నరసింహారావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కమీషనర్ టి.వి. రంగారావు ఆధ్వర్యంలో మున్సిపల్ సిబ్బంది, వార్డు సెక్రటరీలు, మెప్మా సిబ్బంది కలిసి మున్సిపల్ ఆఫీస్ నుండి బస్ స్టాండ్ మీదుగా రాజారత్న జంక్షన్ వరకు రోడ్లను శుభ్రం చేశారు. స్పెషల్ ఆఫీసర్ నాగ నరసింహారావు బస్ స్టాండ్‌లోని వాల్ పోస్టర్లను తొలగించి, పబ్లిక్ టాయిలెట్స్, ఫుడ్ కోర్టులను పరిశీలించారు. నిర్వాహకులకు శుభ్రతపై పలు సూచనలు చేశారు. రెడ్ స్పాట్స్, అనధికార వాల్ పోస్టర్లపై వెంటనే చర్యలు తీసుకోవాలని శానిటేషన్, ప్లానింగ్ సిబ్బందిని ఆదేశించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. రాబోయే 4 వారాల్లో 'ఆపరేషన్ క్లీన్ స్వీప్' కింద చేపట్టాల్సిన కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో డీఈ శ్రీనివాస్, ఆర్వో మాచిరాజు రవి, ఆర్ ఐ కొత్తపల్లి సత్తిబాబు, శానిటరీ ఇన్స్పెక్టర్ ముత్యాల సత్తిరాజు, టీపీవో రమ్య, మేనేజర్లు దంటు శ్రీనివాస్, శ్రీనివాస్ ఇంజనీర్లు పవన్, అనుష, స్వర్ణ వార్డు సెక్రటరీలు పాల్గొన్నారు.

### కరెంట్ కోతలతో అల్లాడుతున్న

# కపిలేశ్వరపురం మండల గ్రామల ప్రజలు



## ఓల్టేజీ హెచ్చు తగ్గులతో గృహప్రకారణాలు దగ్ధం

**కపిలేశ్వరపురం మండలం, విశ్వం వాయిస్ న్యూస్ :** అసలే వేసవి ఉక్కపోతతో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే దీనికి విద్యుత్ కోతలు తోడయ్యాయని వడ్లమూరు ఎంపీటీసీ పలివెల మధు అన్నారు. కపిలేశ్వరపురం మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారనీ వడ్లమూరు ఎంపీటీసీ పలివెల మధు ఆరోపించారు ఎటువంటి షెడ్యూల్, ముందస్తు సమాచారం లేకుండా ఇష్టానుసారంగా కరెంటు కోతలు విధిస్తుండటంతో గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఒక సారి లో వోల్టేజీ, మరో సారి హై వోల్టేజీతో నష్టపోతున్నరని వాపోయారు. కరెంటు తీస్తూ ఇస్తూ ఉండటం వల్ల తీవ్రమైన లో, హై వోల్టేజీ సమస్య ఏర్పడుతోందన్నారు. దీంతో ఇళ్లలో ఫ్యాన్లు, టీవీలు, ఫ్రిజ్‌లు, వాటర్ మోటార్లు ఒక్కొక్కటిగా కాలిపోతున్నాయని పేర్కొన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు వేల రూపాయల్లో నష్టం వాటిల్లుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల చదువులు, వృద్ధుల ఆరోగ్యంపై కూడా ప్రభావం పడుతోందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నాణ్యమైన 24 గంటల విద్యుత్ ఇస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారని, కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉందని మండిపడ్డారు. ప్రభుత్వ శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనీ విమర్శించారు. ప్రజలకు సరైన విద్యుత్ పంపిణీ చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. లో వోల్టేజీ సమస్యను తక్షణమే పరిష్కరించాలని, ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంచి పాత లైన్లు మార్చాలని డిమాండ్ చేశారు. సమస్యను త్వరగా పరిష్కరించకపోతే మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు ఏకమై విద్యుత్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఆ పరిస్థితి రాకుండా అధికారులు ముందుగానే స్పందించాలని హెచ్చరించారు.

# హృదయ ఆరోగ్య పరిరక్షణ, వ్యాయామం, యోగా అవసరం

## – "హార్ట్‌ఫుల్‌నెస్ వెల్‌నెస్ అండ్ మెడిటేషన్" కార్యక్రమం



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ఆదేశాల మేరకు, తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్, పర్యవేక్షణలో జిల్లా వ్యాప్తంగా పోలీసు సిబ్బందికి "హార్ట్‌ఫుల్‌నెస్ వెల్‌నెస్ అండ్ మెడిటేషన్" కార్యక్రమం నిర్వహించబడింది. స్థానిక పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎల్. చెంచిరెడ్డి ఆధ్వర్యంలో రామచంద్ర మిషన్ రాజమహేంద్రవరం ధ్యాన గురువులు ఎస్. రమణ, రాంబాబు పోలీసు సిబ్బందికి ధ్యానం, మానసిక ప్రశాంతత, ఒత్తిడి నియంత్రణపై ప్రత్యేక అవగాహన కల్పించారు. అదనపు ఎస్పీ ఎల్.చెంచిరెడ్డి మాట్లాడుతూ హృదయ ఆరోగ్య పరిరక్షణ, క్రమబద్ధమైన వ్యాయామం, యోగా, ధ్యానం, సమతుల్య ఆహారం, మానసిక ఆరోగ్య సంరక్షణ వంటి అంశాలపై నిపుణులు సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో 42వ బెటాలియన్ కమాండెంట్ పి.సత్తిబాబు, జిల్లా పోలీసు అధికారులు, సీఐడీ విభాగం అధికారులు, ఐఆర్ బెటాలియన్ సిబ్బంది, ఆర్మ్డ్ రిజర్వ్ సిబ్బంది, ట్రాఫిక్ పోలీసులు మరియు ఏపీఎస్పీ ట్రైనీ విద్యార్థులు పాల్గొన్నారు.




### స్విమ్మింగ్ పూల్ వద్ద ఫేక్ ఫోటోస్ వైరల్..

# హీరోయిన్ రుక్మిణి వసంత్ ఆగ్రహం..



చేసింది తక్కువ సినిమాలే అయినప్పటికీ విపరీతమైన క్రేజ్ సొంతం చేసుకున్న హీరోయిన్ రుక్మిణి వసంత్. కన్నడ చిత్ర పరిశ్రమకు చెందిన ఈ అమ్మడు.. రక్షిత్ శెట్టి నటించిన సప్త సాగరాలు దాచే ఎల్లో సినిమాతో ఓవర్ నైట్ స్టార్ అయ్యింది. ఈ మూవీ తర్వాత ఆమెకు వరుస అవకాసాలు క్యూ కట్టాయి. ప్రస్తుతం చేతినిండా ప్రాజెక్టులతో ఫుల్ బిజీగా ఉంది రుక్మిణి వసంత్. రుక్మిణి వసంత్.. దక్షిణాది సినీప్రియులకు ప్రత్యేకంగా పరిచయం అక్కర్లేని పేరు. కన్నడ చిత్ర పరిశ్రమకు చెందిన అమ్మడు.. 2019లో బీర్బల్ ట్రైలాజీ కేసు 1 మూవీతో వెండితెరకు పరిచయమయ్యింది. ఈ సినిమా అంతగా మెప్పించలేదు. కానీ రక్షిత్ శెట్టి నటించిన సప్త సాగరాలు దాటి సినిమాతో ఓవర్ నైట్ స్టార్ అయ్యింది. ఇందులో ప్రియా పాత్రలో ఆమె నటనకు విమర్శకుల ప్రశంసలు అందుకుంది. దీంతో ఆమెకు తెలుగు, తమిళం, కన్నడ భాషలలో వరుస అవకాశాలు క్యూ కట్టాయి. ప్రస్తుతం చేతినిండా సినిమాలతో బిజీగా ఉంది. ఇదిలా ఉంటే.. ఇటీవల స్విమ్మింగ్ పూల్ వద్ద పొట్టి దుస్తులతో ఫోటోషూట్ జరిగినట్లు సోషల్ మీడియాలో ఫోటోస్ వైరలవుతున్నాయి. దీంతో ఇన్నాళ్లు పద్ధతిగా కనిపించిన రుక్మిణి ఇలాంటి ఫోటోషూట్ చేయడమేంటనీ నెటిజన్స్, ఫ్యాన్స్ ఆశ్చర్యపోయారు. అయితే ఆ ఫోటోస్ అన్నీ ఫేక్ అని నటి రుక్మిణి వసంత్ స్పష్టం చేశారు. ఏఐ సాయంతో అసభ్యకర రీతిలో తన ఫోటోలను క్రియేట్ చేసి నెట్టింట పోస్ట్ చేయడం అత్యంత బాధ్యతారాహిత్యమని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు తన ఇన్ స్టా స్టోరీలో ఫేక్ ఫోటోస్ పై ఆగ్రహం వ్యక్తం చేస్తూ పోస్ట్ చేశారు. ఏఐ సాయంతో క్రియేట్ చేసిన అసభ్యకరమైన ఫోటోస్ సోషల్ మీడియాలో వైరల్ అవుడం నేను, నా టీమ్ గుర్తించాం. అవన్నీ ఫేక్.. ఏఐ సాయంతో క్రియేట్ చేశారు. ఇలా ఫోటోస్ క్రియేట్ చేయడం.. సమాచారం షేర్ చేయడం నిజంగా బాధ్యతారాహిత్యమే. అంతేకాదు మా వ్యక్తిగత గోప్యతను ఉల్లంఘించడమే అవుతుంది. ఈ వ్యవహారాన్ని నేను తీవ్రంగా పరిగణిస్తున్నాను. ఫోటోలను క్రియేట్ చేసిన వారితోపాటు ఆన్ లైన్ వేదికగా వైరల్ చేస్తున్న వారిపైనా న్యాయ, సైబర్ క్రైమ్ ద్వారా చర్యలు ప్రారంభించాం. ఇలాంటి కంటెంట్, ఫోటోస్, ఆన్ లైన్ వేదికగా పంచుకోవడం మానుకోవాలని రిక్వెస్ట్ చేస్తున్నాను అంటూ రాసుకొచ్చారు రుక్మిణి వసంత్. ఏఐ సాయంతో హీరోయిన్స్ ఫేక్ వీడియోస్, ఫోటోస్ క్రియేట్ చేయడం ఇది మొదటి సారి కాదు. గతంలో చాలా మంది తారల డీప్ ఫేక్ వీడియోస్, ఫోటోస్ వైరల్ కాగా.. సదరు హీరోయిన్స్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక ఇప్పుడు రుక్మిణి వసంత్ ఫోటోస్ సైతం ఏఐ సాయంతో అసభ్యకర రీతిలో మార్చేశారు. గతంలో సినిమా, పబ్లిక్ ఈవెంట్స్ కు హాజర్యే హీరోయిన్లను అభ్యంతరకర రీతిలో ఫొటోలు తీయడం పైనా రుక్మిణి ఆగ్రహం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. జూమ్ చేసి మరీ తమ శరీరాలను ఫోటోలు తీయాల్సిన అవసరం ఏముందని ఆమె అన్నారు. ఇప్పుడు ఏఐ సాయంతో ఏకంగా తనవే ఫేక్ ఫోటోస్ చేయడం పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక రుక్మిణి వసంత్ విషయానికి వస్తే.. తన సహజసిద్ధమైన నటనతో, కళ్లతోనే హావభావాలు పలికించే ప్రతిభతో ఆమె ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంటున్నారు. సప్త సాగరాలు దాటి సినిమాతో తెలుగు కుర్రాళ్ల మనసు దోచుకున్న రుక్మిణికి ఇక్కడ వరుస ఆఫర్లు క్యూ కడుతున్నాయి. ప్రస్తుతం ఈ అమ్మడు ఎన్టీఆర్, ప్రశాంత్ నీల్ కాంబోలో వస్తున్న డ్రాగన్ చిత్రంలో నటిస్తున్న సంగతి తెలిసిందే. ఇటీవల తారక్ బర్త్ డే సందర్భంగా విడుదలైన గ్లింప్స్ సినిమాపై అంచనాలు పెంచేసింది. ఈ మూవీతోపాటు తెలుగులో మరిన్ని చిత్రాల్లోనూ ఈ అమ్మడు నటిస్తున్నట్లు సమాచారం.

### ఆరోజు అలా జరిగే సరికి మా ఆయనను పట్టుకుని వెక్కి వెక్కి ఏడ్చా..

# షాకింగ్ విషయం చెప్పిన అనసూయ



మొన్నటివరకు జబర్దస్త్‌తో పాటు ఇతర టీవీ షోలతో బిజీగా ఉన్న అనసూయ ఇప్పుడు చేతి నిండా సినిమాలతో బిజీ బిజీగా ఉంటోంది. అయితే తాజాగా ఆమె ఒక ఇంటర్వ్యూకు హాజరైంది. అందులో తన పర్సనల్ అండ్ ప్రొఫెషనల్ లైఫ్ నకు సంబంధించి పలు ఆసక్తికర విషయాలను పంచుకుంది. టెలివిజన్ యాంకర్‌గా కెరీర్ ప్రారంభించింది అనసూయ. అలాగే కెరీర్ ప్రారంభంలో కొన్ని సినిమాల్లో చిన్నా చితకా పాత్రలు పోషించింది. అయితే జబర్దస్త్ లోకి అడుగు పెట్టాక ఆమె క్రేజ్ అమాంతం పెరిగిపోయింది. తన అందం, చలాకీతనంతో తెలుగు బుల్లితెర ఆడియెన్స్ కు బాగా చేరువైంది అందాల తార. అదే సమయంలో క్షణం, సోగ్గాడే చిన్ని నాయనా వంటి సినిమాల్లో విలన్‌గా, సహాయక నటిగానూ మెప్పించింది అనసూయ. ఇక రంగస్థలంలో ఆమె పోషించిన రంగమ్మత్త పాత్ర బాగా హైలెట్ అయ్యింది. దీంతో బుల్లితెరకు బై బై చెప్పేసి ఇప్పుడు సినిమాల్లోనే కొనసాగుతోంది. ప్రస్తుతం ఆమె చేతిలో పలు క్రేజీ ప్రాజెక్టులు ఉన్నాయి. అయితే తాజాగా ఓ ఇంటర్వ్యూకు హాజరైంది అనసూయ. అందులో తన పర్సనల్ అండ్ ప్రొఫెషనల్ లైఫ్ నకు సంబంధించి పలు ఆసక్తికర విషయాలు పంచుకుంది. అదే సమయంలో కెరీర్ ప్రారంభంలో తనకు ఎదురైన అవమానాలు, ఛీత్కారాల గురించి చెబుతూ బాగా ఎమోషనల్ అయ్యింది. 'నా కెరీర్ పీక్స్‌లో ఉన్న టైమ్‌లో మూడు క్రేజీ ప్రాజెక్టుల కోసం నన్ను ముందుగా ఎంపిక చేశారు. కానీ ఆ తర్వాత ఎలాంటి కారణం చెప్పకుండా ఆ సినిమాల నుంచి నన్ను తొలగించారు. ఎందుకు తీసేశారు? ఏం జరిగింది? అన్న విషయంపై కనీస వివరణ కూడా ఇవ్వలేదు. ఆ సంఘటన నన్ను తీవ్రంగా బాధించింది. ఆ రోజు రాత్రి నిద్ర పట్టలేదు. అర్ధరాత్రి రెండు గంటల సమయంలో మా ఆయన దగ్గర కూర్చొని వెక్కి వెక్కి ఏడ్చేశాను. ఆ బాధను జీర్ణించుకోలేకపోయాను' అని వాపోయింది అనసూయ. ఇక సినిమాల గురించి కాకుండా తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన కొన్ని విషయాలపై కూడా సోషల్ మీడియాలో అనవసర చర్చలు జరిగాయని అనసూయ ఆవేదన వ్యక్తం చేసింది. 'నేను అప్పుడప్పుడు డ్రింక్ చేస్తాను. కానీ పరిమితంగానే తీసుకుంటాను. ఆ విషయాన్ని కూడా కొందరు వివాదంగా మార్చి సోషల్ మీడియాలో ట్రోల్ చేశారు. అయితే ఇప్పుడు ట్రోలింగ్ గురించి నేను పెద్దగా పట్టించుకోను.

# ఇది రా రోహిత్ అంటే.. లేడీ ఫ్యాన్‌కి సారీ చెబుతూ వీడియో..

### అసలు మ్యాటర్ తెలిస్తే సెల్యూట్ చేస్తారంతే..!





భారత క్రికెట్ దిగ్గజం, హిట్‌మ్యాన్ రోహిత్ శర్మ మైదానంలోనే కాదు, నిజజీవితంలోనూ తన అభిమానుల పట్ల ఎంతటి ప్రేమను కనబరుస్తాడో మరోసారి నిరూపితమైంది. కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో తనను కలవలేక ఏడ్చేసిన ఒక మహిళా అభిమాని ఆవేదనను చూసి చలించిపోయిన రోహిత్, ఆమెకు ప్రత్యేకంగా క్షమాపణలు చెబుతూ పంపిన వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా ముంబై ఇండియన్స్, కోల్‌కతా నైట్ రైడర్స్ జట్ల మధ్య ఈడెన్ గార్డెన్స్ వేదికగా మ్యాచ్ జరిగింది. ఈ సందర్భంగా ముంబై జట్టు బస చేసిన హోటల్ వెలుపల తమ అభిమాన ఆటగాడు రోహిత్ శర్మను ఒక్కసారైనా చూడాలని, సెల్ఫీ దిగాలని వందలాది మంది అభిమానులు గుమిగూడారు. ఆ రద్దీలో ఓ ఫ్యాన్ గర్ల్ చాలా సేపటి నుంచి నిలబడి ఎదురుచూసింది. అయితే, విపరీతమైన జనం, భద్రతా కారణాల దృష్ట్యా రోహిత్ ఆమెను గమనించకుండానే ముందుకు సాగిపోయాడు. ఆ క్షణంలో తన ఆరాధ్య దైవాన్ని కలిసే సువర్ణావకాశాన్ని కోల్పోయానని సదరు యువతి తీవ్ర ఆవేదనకు గురైంది. హోటల్ కారిడార్‌లోనే కన్నీళ్లు పెట్టుకుంటూ, తన బాధను వ్యక్తం చేసిన వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. రోహిత్‌ను కలవలేకపోయాననే బాధ ఆమె ముఖంలో స్పష్టంగా కనిపించింది. సాధారణంగా ఎంత పెద్ద స్టార్ ఆటగాడైనా ఇలాంటి చిన్న చిన్న సంఘటనలను పెద్దగా పట్టించుకోరు. కానీ రోహిత్ శర్మ మనసు చాలా పెద్దదని ఈ ఘటనతో మరోసారి రుజువైంది. సామాజిక మాధ్యమాల్లో ఆ యువతి ఏడుస్తున్న వీడియోను చూసిన వెంటనే రోహిత్ స్పందించాడు. ఆమె బాధను అర్థం చేసుకుని, నేరుగా ఒక భావోద్వేగ భరితమైన వీడియో సందేశాన్ని విడుదల చేశాడు. ఆ వీడియోలో రోహిత్ చూపించిన సానుకూలత నెటిజన్ల మనసులను గెలుచుకుంది. "నన్ను క్షమించు.. ఆ సమయంలో ఈడెన్ గార్డెన్స్‌లో నిన్ను కలవలేకపోయాను. నేను నీ వీడియోను చూశాను. మైదానం వెలుపల, హోటల్ వద్ద కొన్నిసార్లు విపరీతమైన రద్దీ, గందరగోళం, పెద్దగా శబ్దాలు ఉంటాయి. అందుకే నా దృష్టి నీపై పడలేదు. కానీ నేను నీకు మాట ఇస్తున్నాను, వచ్చేసారి నేను ఎప్పుడు కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌కు వచ్చినా ఖచ్చితంగా నిన్ను కలిసి తీరుతాను" అని రోహిత్ శర్మ ఆ వీడియోలో ఎంతో వినమ్రంగా మాట్లాడాడు.

**నెట్టింట హిట్‌మ్యాన్‌పై ప్రశంసల జల్లు..**

ఒక అంతర్జాతీయ స్థాయి ఆటగాడు, కోట్లాది మంది అభిమానులు ఉన్న వ్యక్తి.. కేవలం ఒక సాధారణ అభిమాని కన్నీళ్ల కోసం ప్రత్యేకంగా సమయం కేటాయించి, క్షమాపణలు కోరడం సాధారణ విషయం కాదు. రోహిత్ శర్మ చేసిన ఈ అద్భుతమైన పనికి క్రికెట్ ప్రపంచం ఫిదా అవుతోంది. "అందుకే నిన్ను అందరూ హిట్‌మ్యాన్ అని, ఒక మంచి నాయకుడని పిలుస్తారు" అంటూ అభిమానులు సామాజిక మాధ్యమాల్లో కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. ఆ యువతి కన్నీళ్లను తుడిచేలా రోహిత్ ఇచ్చిన ఈ హామీ ఆమె జీవితంలో ఒక మధుర జ్ఞాపకంగా నిలిచిపోతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఆటగాళ్లకు అసలైన బలం అభిమానులే అని రోహిత్ శర్మ ఈ చర్య ద్వారా నిరూపించారు. ఐపీఎల్ మ్యాచ్‌ల ఒత్తిడిలోనూ తనను ప్రాణంగా భావించే అభిమానుల ఎమోషన్స్‌కు విలువ ఇవ్వడం రోహిత్ గొప్పతనానికి నిదర్శనం. వచ్చేసారి ఈడెన్ గార్డెన్స్‌లో ఈ అభిమానికి, హిట్‌మ్యాన్‌కు మధ్య జరిగే ఆ అద్భుతమైన భేటీ కోసం ఇప్పుడు క్రికెట్ ప్రపంచమంతా ఆసక్తిగా ఎదురుచూస్తోంది.

### 933 బంతుల్లో 100 సిక్సర్లు..

# గేల్ రికార్డ్ బద్దలు కొట్టిన కోహ్లీ జిగిరీ దోస్త్..!



ఐపీఎల్ చరిత్రలో వెస్టిండీస్ బ్యాటర్ల పవర్‌హిట్టింగ్‌కు తిరుగులేదని ఈ జాబితా స్పష్టం చేస్తోంది. అయినప్పటికీ, కరీబియన్ దిగ్గజాల మధ్య రజత్ పటిదార్ లాంటి భారతీయ సాంకేతిక బ్యాటర్ తనదైన శైలిలో సిక్సర్ల వీరుడిగా ఎదగడం విశేషం. రాబోయే రోజుల్లో ఈ యువ ఆటగాడు మరిన్ని రికార్డులను తిరగరాయాలని ఆశిద్దాం. ప్రపంచంలోనే అత్యంత ప్రజాదరణ పొందిన ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) అంటేనే బౌండరీల మోత, సిక్సర్ల సునామీ. ఈ మెగా టోర్నీ చరిత్రలో అత్యంత తక్కువ బంతుల్లో వంద సిక్సర్ల మైలురాయిని అందుకున్న టాప్-5 విధ్వంసకర బ్యాటర్ల జాబితా తాజాగా విడుదలైంది. వెస్టిండీస్ పవర్‌హిట్టర్ల ఆధిపత్యం ఉన్న ఈ చారిత్రాత్మక జాబితాలోకి భారత యువ సంచలనం రజత్ పటిదార్ చేరి సంచలనం సృష్టించాడు.

**సిక్సర్ల వేటలో ఆండ్రీ రస్సెల్ అగ్రస్థానం..**

క్రీజులోకి వస్తే చాలు బంతిని స్టేడియం దాటించడమే లక్ష్యంగా పెట్టుకునే కోల్‌కతా నైట్ రైడర్స్ స్టార్ ఆల్‌రౌండర్ ఆండ్రీ రస్సెల్ ఈ జాబితాలో మొదటి స్థానంలో నిలిచాడు. తన కండబలంతో ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడే రస్సెల్, ఐపీఎల్‌లో కేవలం 657 బంతుల్లోనే వంద సిక్సర్ల మార్కును దాటి ఎవరికీ అందనంత ఎత్తులో నిలిచాడు. టి20 క్రికెట్‌లో అతడి విధ్వంసానికి ఈ గణాంకాలే నిలువెత్తు నిదర్శనం.

**రెండో స్థానంలో పూరన్.. మూడో స్థానంలో భారతీయుడు**

ఇక ఈ విలక్షణమైన రికార్డులో లక్నో సూపర్ జాయింట్స్ బ్యాటర్ నికోలస్ పూరన్ 884 బంతులతో రెండో స్థానాన్ని ఆక్రమించాడు. అయితే ప్రస్తుత సీజన్‌లో అందరి దృష్టిని ఆకర్షించింది మాత్రం రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు నయా స్టార్ రజత్ పటిదార్. కేవలం 933 బంతుల్లోనే 100 సిక్సర్లు పూర్తి చేసుకున్న పటిదార్, ఈ ఘనత సాధించిన అత్యంత వేగవంతమైన భారతీయ బ్యాటర్‌గా రికార్డు సృష్టించాడు. స్పిన్, పేస్ అనే తేడా లేకుండా మైదానం నలుమూలలా సిక్సర్లు బాదగల నైపుణ్యం అతడిని ఈ స్థానంలో నిలబెట్టింది.

**టాప్-5 లో నిలిచిన దిగ్గజాలు వీరే..**

ఈ చార్టులో మిగిలిన స్థానాలను పరిశీలిస్తే అంతా టీ20 ప్రపంచాన్ని ఏలిన దిగ్గజాలే కనిపిస్తారు.

ఆండ్రీ రస్సెల్: 657 బంతులు (మొదటి స్థానం), నికోలస్ పూరన్: 884 బంతులు (రెండో స్థానం), రజత్ పటిదార్: 933 బంతులు (మూడో స్థానం), క్రిస్ గేల్: 943 బంతులు (నాలుగో స్థానం), సునీల్ నరైన్: 950 బంతులు (ఐదో స్థానం), యూనివర్స్ బాస్ క్రిస్ గేల్ 943 బంతుల్లో ఈ మైలురాయిని అందుకోగా, కోల్‌కతా ఓపెనర్ సునీల్ నరైన్ 950 బంతులతో ఐదో స్థానంలో కొనసాగుతున్నాడు. గేల్ లాంటి మహా ముదురు బ్యాటర్‌ను పటిదార్ వెనక్కి నెట్టడం భారత క్రికెట్ అభిమానులకు గర్వకారణంగా మారింది.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...




VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com